ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com




సంపుటి-1 | సంచిక - 165 | ఆదివారం 15 మార్చి 2026 | పేజీలు -8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

## మొజ్తబా ఆచూకీ చెబితే 10మిలియన్ డాలర్లు

**రివార్డ్ ఫర్ జస్టిస్ ప్రకటించిన అమెరికా**



**వాషింగ్టన్ (తెలుగోడు),మార్చి 14 :** ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు పగ్గాలు చేపట్టినా తమ తదుపరి టార్గెట్ అయనే అవుతారని ఇంతకుముందే ప్రకటించిన అమెరికా ఆ దిశగా మరో ముందడుగు వేసింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కానీ, (మిగతా 2లో)

## ఇరాన్ దాడులతో దుబాయ్ అతలాకుతలం

**షాపింగ్ మాల్స్ మూతతో పర్యాటకం బంద్**



**దుబాయ్ (తెలుగోడు), మార్చి 14 :** దుబాయ్.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బిలియనీర్ల కలల నగరం. పెట్టుబడులకు, రక్షణకు, స్వేచ్ఛా జీవితానికి దుబాయ్ ప్రతీక. విమానయాన రంగానికి కీలక స్థానం. ఎప్పుడూ విదేశీ పర్యాటకులు, పెట్టుబడిదారులతో కళకళలాడే నగరం. అలాంటి మహా నగరాన్ని ఇరాన్ యుద్ధం కళా విహీనంగా మార్చింది. పశ్చిమాసియాలో యుద్ధం దుబాయ్ నగరంపై తీవ్ర ప్రభావం చూపించింది .యుద్ధం నేపథ్యంలో దుబాయ్ నగరం (మిగతా 2లో)

# పశ్చిమాసియా యుద్ధంపై భయపడొద్దు



- కాంగ్రెస్ పార్టీ భయాందోళనలు సృష్టిస్తోందని విమర్శ..
- అస్సాంలో వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం..
- 22,864 కోట్ల షిల్లాంగ్-సిల్చార్ హైస్పీడ్ కారిడార్‌కు భూమిపూజ..
- 166 కిలోమీటర్ల నాలుగు లేన్ల గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం..
- రైతులకు పీఎం కిసాన్ పథకం నిధుల విడుదల..
- ఉత్తర తూర్పు అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని వ్యాఖ్య.....

**సిల్చార్ (తెలుగోడు), మార్చి 14 :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశ ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అస్సాం రాష్ట్రంలోని సిల్చార్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడుతూ దేశానికి అవసరమైన సరఫరాలు, వనరుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ అనవసరంగా భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్ని స్తోందని విమర్శించారు.అస్సాం రాష్ట్రంలోని సిల్చార్ నగరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నరేంద్ర మోదీ ఉత్తర తూర్పు ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా సుమారు 22,864 కోట్ల వ్యయంతో నిర్మించనున్న షిల్లాంగ్--సిల్చార్ గ్రీన్ ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్‌కు ఆయన భూమిపూజ చేశారు. సుమారు 166.8 కిలోమీటర్ల పొడవుతో నిర్మించనున్న ఈ నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ రహదారి మేఘాలయ లోని మావ్లింగ్‌ఖుంగ్ ప్రాంతం నుంచి అస్సాం లోని పంచగ్రామ్ వరకు విస్తరించనుంది. ఈ మార్గం మేఘాలయలో సుమారు 144.8 కిలోమీటర్లు, అస్సాంలో 22 కిలోమీటర్ల మేర సాగనుంది.

ఈ భారీ రహదారి ప్రాజెక్టు పూర్తయితే ప్రస్తుతం చాలా ఎక్కువ సమయం పట్టే గువాహటి,సిల్చార్ ప్రయాణం గణనీయంగా తగ్గి సుమారు నాలుగు నుంచి ఐదు గంటలలో పూర్తి చేసే అవకాశం ఉంటుందని అధికారులు 2లో

## పాడేరులో జనసేన ఆవిర్భావ వేడుకలు

**ఓనూరులో పార్టీ జెండాను ఆవిష్కరించిన పవన్**

**థింసా నృత్యంతో స్వాగతం పలికిన గిరజన మహిళలు**

**పార్టీ ఆవిర్భావం సందర్భంగా చంద్రబాబు, లోకేశ్ అభినందనలు**



**పాడేరు (తెలుగోడు), మార్చి 14 :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో పర్యటించారు. ఓనూరు నుంచి నందిగరువుకు కాలినడకన వెళ్లారు. అనంతరం రోడ్డు పనులు పరిశీలించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఓనూరులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పవన్ వెంట పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అరకు పార్లమెంటు ఇంఛార్జి గంగులయ్య, నేతలు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా పవన్‌కు స్థానిక మహిళలు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. పవన్ సమక్షంలో పలువురు జనసేనలో చేరారు. వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఓనూరులో అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. గర్భిణి స్త్రీలకు పౌష్టికాహారం అందించారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్‌కు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో, తెలుగు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో జనసేన పోషిస్తున్న పాత్ర అభినందనీయమన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ వారి భవిష్యత్ కోసం పనిచేస్తున్న జనసైనికులకు, వీరమహిళలకు, నేతలకు సీఎం శుభాభినందనలు తెలిపారు. పవన్‌కు మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఏడు సిద్ధాంతాలతో ప్రజాజీవితాల్లో భాగం కావడం సంతోషమన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత (మిగతా 2లో)

## పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్‌కు స్వేచ్ఛ

**నిర్బంధాన్ని రద్దు చేస్తూ హెూం శాఖ ఉత్తర్వులు**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 14 :** పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ నిర్బంధాన్ని రద్దు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ప్రకటన విడుదల చేసింది. దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన జైలు నుంచి విడుదల కానున్నారు. లద్దాఖ్ కు రాష్ట్ర హోదా డిమాండ్ చేస్తూ గతేడాది లేహ్ ప్రాంతంలో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గాయపడ్డారు. ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే (మిగతా 2లో)

## వంట గ్యాస్ సమస్య రానివ్వద్దు

**కేంద్రంతో సమన్వయం చేసుకుని సమస్య లేకుండా ప్రయత్నం చేయండి.**

**క్యాబినెట్ మీట్‌లో వున్న మంత్రులు పయ్యావుల, అచ్చెన్న, నాదెండ్లకు సిఎం చంద్రబాబు ఆదేశం...**




**అమరావతి (తెలుగోడు), మార్చి 14 :** గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఆందోళన చెందకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశంచేశారు. పలువురు మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్యాస్ సరఫరా అంశంపై మంత్రులతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితిని మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రికి వివరించారు. గ్యాస్ సరఫరా అంశంపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ భేటీ అవుతున్నట్లు సీఎంకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వపరంగా ఏం చేయాలో, ఎంత చేయాలో అంతా చేయాలని సీఎం సూచించారు. కేంద్రంతో (మిగతా 2లో)

## గ్యాస్ సంక్షోభం రాకుండా చర్యలు

**అప్పన్నను దర్శించుకున్న హోంమంత్రి అనిత**



**విశాఖపట్నం (తెలుగోడు), మార్చి 14 :** ఏపీలో గ్యాస్ సంక్షోభం లేకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత గురించి ఆందోళనలు తలెత్తుతుండటంతో రాష్ట్రంలో ఏవిధమైన సంక్షోభం రాకుండా చర్యలు చేపట్టామని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్టీజీఎస్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారని వెల్లడించారు. ఆర్టీజీఎస్ రాష్ట్రానికి గుండెలాంటిదిగా హోంమంత్రి పేర్కొన్నారు. అధికారులకు సీఎం చంద్రబాబు తగిన ఆదేశాలు జారీ చేశారన్నారు. గ్యాస్ సరఫరా సాఫీగా సాగేలా చూస్తున్నట్లు హోంమంత్రి వివరించారు. దయచేసి వదంతులను నమ్మొద్దని ప్రజలను కోరారు. గ్యాస్ సరఫరాపై సామాజిక మాధ్యమాల్లో కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని హోంమంత్రి అనిత తెలిపారు. (మిగతా 2లో)

## రాజధానిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు

## అమరావతి గ్రామాల్లో పర్యటించిన మంత్రి నారాయణ



**అమరావతి (తెలుగోడు), మార్చి 14 :** అమరావతిలోని ఆయా గ్రామాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఏపీ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. ఈ పనులు ప్రారంభించిన ఆరు నెలల్లోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో అండర్ గ్రౌండ్ వాటర్, స్టామ్ వాటర్, వీధి దీపాలు, సిమెంట్ రోడ్లు వేస్తామని తెలిపారు. శనివారం అమరావతిలోని అనంతవరం, నెక్కలు గ్రామసభల్లో మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు. గ్రామాల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి (మిగతా 2లో)

## కూటమి గొప్పలు పెరుగుతున్న అప్పులు

- అరకొర పథకాలు అమలు చేసి అన్నీ ఇచ్చేశామని ప్రచారం..
- రాష్ట్రాన్ని రూ.3.27 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిందని ఆరోపణ..
- అమరావతి పేరుతో భారీ రుణాలు తీసుకున్నారని విమర్శ..
- సీఏజీ నివేదిక ప్రస్తావించగానే టీడీపీ నేతలకు వణుకు..
- మాజీ మంత్రి బుగ్గన..




**హైదరాబాద్ (తెలుగోడు), మార్చి 14 :** హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రాష్ట్రంలో అరకొరగా పథకాలు అమలు చేసి అన్నీ ఇచ్చేశామని గొప్పలు చెప్పుకోవడం ప్రజలను మోసం చేయడమేనని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టిందని ఆరోపించారు. మొత్తం రూ. 3.27 లక్షల కోట్ల మేర అప్పులు చేసి కూడా నిజాలను దాచిపెట్టి తప్పుడు లెక్కలు చెబుతోందని విమర్శించారు.ఆర్బీఐ నుంచి తీసుకొచ్చిన నిధులు అప్పుకాదా అని ప్రశ్నించిన ఆయన, తాత్కాలికంగా తీసుకున్న అప్పు కూడా తిరిగి చెల్లించాల్సిందేనని గుర్తుచేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రభుత్వం ఆర్థిక లెక్కలను చూపుతోందని అన్నారు. రాజధాని అమరావతి పేరుతోనే రూ. 47,837 కోట్లకు పైగా అప్పులు తీసుకున్నారని పేర్కొన్నారు. అదే విధంగా కార్పొరేషన్ల పేరుతో వేల కోట్ల రూపాయల అప్పులు తీసుకువచ్చి వాటిని అసలు అప్పులుగా చూపకుండా దాచిపెడుతున్నారని విమర్శించారు.రాష్ట్రంలో ఏ రంగాన్నీ వదిలిపెట్టకుండా భారీగా అప్పులు తెచ్చారని, ఇది పూర్తిగా ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టే విధానమని అన్నారు. ప్రభుత్వం పారదర్శకతతో వ్యవహరించాల్సిన సమయంలో ప్రజలకు అసలు నిజాలను చెప్పకుండా ప్రచార రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇటీవల 2024-25 సీఏజీ నివేదికపై మాట్లాడిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఆయన వ్యాఖ్యానించారు. సీఏజీ నివేదికలో ఉన్న (మిగతా 2లో)

## శబరిమలలో మహిళలకు ప్రవేశం

**యూ టర్న్ తీసుకున్న కేరళ ప్రభుత్వం..**

**50 ఏళ్ల లోపు వారికి అనుమతి కుదరదు..**

**సుప్రీంకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం...**



**తిరువనంతపురం (తెలుగోడు), మార్చి 14** 50 ఏళ్లలోపు మహిళల్ని శబరిమల ఆలయం లోకి అనుమతించే అంశంపై కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల్ని ఆలయంలోకి అనుమతించ కూడదని నిర్ణయించింది. ఈ మేరకు కేరళం సీఎం పినరయి విజయన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో దీనిపై ఆమోదం లభించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. భక్తుల మనోభావాలు, ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాల్ని దృష్టిలో ఉంచుకుని, వాటిని కాపాడాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, త్వరలోనే కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాజకీయ కోణంలోనే ఎల్డీఎఫ్ (లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్) ఈ నిర్ణయం తీసుకుందని రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. శబరిమల ఆలయంలోకి వయసుతో సంబంధం లేకుండా మహిళలకు ప్రవేశం కల్పించాలని కొన్నేళ్లక్రితం ఆందోళనలు చెలరేగాయి. అయితే, ఈ నిర్ణయాన్ని శబరిమల ఆలయ యాజమాన్య బాధ్యతలు చూసే ట్రావెన్‌కోర్ దేవస్తాన బోర్డు వ్యతిరేకించింది. ఎప్పటినుంచో ఉన్న సంప్రదాయం ప్రకారం.. మహిళలకు మెనుస్ట్రువల్ సైకిల్ ఉండే పదేళ్ల వయసు నుంచి 50 ఏళ్ల వయసు మహిళల్ని ఆలయంలోకి అనుమతించబోమని తెలిపింది. ఈ నిర్ణయాన్ని 2018లో ప్రభుత్వం వ్యతిరేకించింది. అన్ని వయసుల వారికి ఆలయ ప్రవేశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.రాజ్యాంగం ఇచ్చిన హక్కు తో మహిళలు ఆలయంలోకి వెళ్లొచ్చని తెలిపింది.

# ఇంటికే భద్రాద్రి కళ్యాణ తలంబ్రాలు

## ముందస్తు బుకింగ్‌తో అధికారుల ఏర్పాట్లు

## ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా అందుబాటులో సేవలు



**భద్రాచలం(తెలుగోడు), మార్చి 14 :**

తెలుగు రాష్ట్రాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగలలో శ్రీరామనవమి ప్రధానమైనది. 'దక్షిణ అయోధ్య'గా ప్రసిద్ధి చెందిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించే కళ్యాణ బ్రహ్మోత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ నవమి రోజున నిర్వహించే ఈ వార్షిక కళ్యాణ వేడుకను కళ్లారా వీక్షించేందుకు దేశ విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. రామదాసు కీర్తనలతో మార్మోగే భద్రాద్రి గిరులు, గోదావరి నది తీరాన జరిగే ఈ అద్భుత ఘట్టం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. ఈ ఏడాది మార్చి 19న ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 2 వరకు వైభవంగా సాగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా ఈసారి కళ్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలనుకునే భక్తుల కోసం టికెట్ బుకింగ్ , రాలేని భక్తుల కోసం ఇంటికే తలంబ్రాలను పంపే వినూత్న ఏర్పాట్లు కూడా సిద్ధమయ్యాయి. ఈ మహోత్సవంలో అత్యంత ముఖ్యమైన శ్రీ సీతారాముల వార్షిక కళ్యాణం మార్చి 27న జరగనుండగా, మరుసటి రోజు అనగా మార్చి 28న శ్రీరాముడి పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. భక్తులు ఈ పవిత్ర కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి ఆలయ అధికారులు ప్రత్యేక సెక్టార్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం భక్తులు భద్రాచలం దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. వెబ్‌సైట్ హోమ్ పేజీలోని 'శ్రీరామనవమి టికెట్' లింక్‌పై క్లిక్ చేసి, తమకు నచ్చిన కళ్యాణం లేదా పట్టాభిషేకం సెక్టార్‌ను ఎంచుకుని నిర్ణయించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ సదుపాయం లేని వారు మార్చి 15 నుంచి భద్రాచలం రామాలయ ప్రధాన కౌంటర్, తానీషా కళ్యాణ మండపం, గోదావరి బ్రిడ్జ్ వద్ద ఉన్న దేవస్థానం విచారణ విభాగం లేదా భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం ద్వారా నేరుగా టికెట్లు పొందవచ్చు.

దూర ప్రాంతాల్లో ఉండి భద్రాచలానికి రాలేని భక్తుల కోసం కూడా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ. 5,000 లేదా రూ. 1,116 టికెట్లు బుక్ చేసుకుంటే, వారి గోత్ర నామాలతో ఆలయంలో కళ్యాణం నిర్వహిస్తారు. అంతేకాకుండా, స్వామివారి ముత్యాల తలంబ్రాలను భక్తుల ఇళ్లకే చేర్చేందుకు ఞఉఞాఖిఅ లాజిస్టిక్స్ విభాగం ప్రత్యేక సేవలను అందిస్తోంది. రూ. 151 చెల్లించి సమీప ఆర్టీసీ కౌంటర్లలో లేదా ఆన్‌లైన్ ద్వారా తలంబ్రాలను బుక్ చేసుకుంటే, ఉత్సవాల అనంతరం వాటిని ఇంటికే డెలివరీ చేస్తారు. ఈ ఏడాది సుమారు 5 లక్షల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు, 2 లక్షల చిన్న లడ్డూలు , 3 వేలకు పైగా మహా లడ్డూలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థలు వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సు సర్వీసులను కూడా అందుబాటులోకి తెచ్చాయి.

# గ్యాస్‌పై ప్రజలు ఆందోళన చెందొద్దు

## కొరత సమస్య లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు..వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి



**అమరావతి (తెలుగోడు), మార్చి 14 :**

రాష్ట్రంలో వంట గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలకు ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, మంత్రుల బృందం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం కానూరులోని పౌర సరఫరాల రాష్ట్ర కార్యాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, వర్చువల్‌గా నాదెండ్ల మనోహర్.. పౌర సరఫరాలు, సమాచార, పౌర సంబంధాలు, పోలీస్, విజిలెన్స్ తదితర సమన్వయ శాఖల అధికారులతో పాటు ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ తదితర ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్‌పీజీ రోజువారీ అవసరాలు, సరఫరా స్థితిగతులతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. రియల్ టైమ్ డేటా విశ్లేషణ ఆధారంగా పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గౌరవ ప్రధాని నేతృత్వంలో కేంద్రం, గౌరవ సీఎం నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రుల బృందంతో పాటు అధికారుల బృందాలు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్తూ భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. వదంతులు నమ్మవద్దని కోరారు. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం కారణంగా, నౌకల రవాణాకు ఆటంకం వల్ల సరఫరా వ్యవస్థలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని.. అయితే వ్యవస్థల పునరుద్ధరణకు, బలోపేతానికి, కొత్త మార్గాల అన్వేషణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కేంద్రం మార్గదర్శకాలతో రాష్ట్ర స్థాయిలో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇతర పెట్రోలియం ఉత్పత్తులను తగ్గించి, గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్రం దేశవ్యాప్త రి÷నైరీలను ఆదేశించిందని, దీనివల్ల ఉత్పత్తి 10 శాతం నుంచి 20 శాతం వరకు పెరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా కుటుంబాలపై ప్రభావం పడకుండా వంట గ్యాస్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. ఆసుపత్రులు, వసతిగృహాల కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్యాస్ సిలిండర్లపై కేంద్రం కొన్ని పరిమితులు విధించిందని.. ప్రస్తుతానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు, డబుల్ సిలిండర్లు ఉన్నవారికి 32 రోజులకు సిలిండర్ పొందేలా మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. అనవసరంగా ఆందోళనకు గురికావద్దని, కష్టాన్ని, నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు:విపత్కర పరిస్థితులను లాభార్జన కోసం ఉపయోగించుకోవాలనే తలంపుతో ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గౌరవ సీఎం ఆదేశాలతో ప్రత్యామ్నాయాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే హోటళ్లు, గ్యాస్ డీలర్లు తదితర అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విపత్కర కాలంలో వివిధ రకాల వినూత్న ఆప్షన్లను ముందుకు తీసుకొస్తున్నారన్నారు. ప్రజల సలహాలు, సూచనలను కూడా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 95 శాతం ఆన్‌లైన్ బుకింగ్‌లు జరుగుతున్నాయని, 88 శాతం వరకు ఓటీపీ ఆధారిత గ్యాస్ సిలిండర్ల డెలివరీలు జరుగుతున్నాయని.. ఈ శాతాన్ని పెంచాలని సంస్థలకు సూచించామన్నారు. ఆర్‌టీజీఎస్ తో పాటు కలెక్టర్ల కార్యాలయాల్లోనూ ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ వనరులను ఉపయోగించుకోవడంలో భాగంగా పైప్డ్ గ్యాస్‌పైనా ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్ల మంత్రి తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి దార్శనికతతో విజయవాడతో పాటు వివిధ నగరాల్లో విజయవంతంగా నడుస్తున్న పైప్డ్ గ్యాస్ నేడు వరంగా మారాయని పేర్కొన్నారు. నేచురల్ గ్యాస్‌ను సమర్థవంతంగా వినియోగించుకునే విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయం ఇప్పటికే దృష్టిసారించినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, డైరెక్టర్ శ్రీవాస్ నుపుర్ అజయ్‌కుమార్, సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్, సమన్వయ శాఖల ఉన్నతాధికారులు, చమురు సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి గొప్పలు..పెరుగుతున్న అప్పులు




(మొదటి పేజీ (తరువాయి)

అంశాలను ప్రస్తావించడమే తప్పు అన్నట్లుగా కూటమి నేతలు స్పందించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. జగన్ మాట్లాడగానే టీడీపీ నాయకుల్లో వణుకు ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బాధ్యతను గుర్తుచేసినందుకే ఈ రకమైన విమర్శలు వస్తున్నాయని ఆయన అన్నారు. టీడీపీ రాజకీయాలు ప్రారంభం నుంచే సినిమా ప్రభావంతోనే సాగుతున్నాయని వ్యాఖ్యానించిన బుగ్గన, ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు కూడా సినిమా టైటిల్స్‌లా ఉంటున్నాయని ఎద్దేవా చేశారు. ప్రచారంలో పెద్ద పెద్ద హామీలు ఇస్తూ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం గ్యాస్ కొరత కారణంగా పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. ప్రజల జీవన వ్యయాలు పెరుగుతున్న సమయంలో ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అప్పుల విషయానికి వస్తే ప్రభుత్వం ప్రకటించిన లెక్కలకంటే వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందని ఆయన అన్నారు. 2024-25 సంవత్సరంలో రూ.60 వేల కోట్ల అప్పు చేశామని ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించినా, సీఏజీ నివేదిక ప్రకారం రూ.80 వేల కోట్లకు పైగా అప్పులు చేసినట్లు స్పష్టంగా ఉందని తెలిపారు. ఈ వ్యత్యాసంపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు.

# బాధితులకు భరోసా

## నల్లమాడలో పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం..

## టీడీపీ కార్యకర్త గంగప్ప కుటుంబానికి ధైర్యం చెప్పిన మాజీ మంత్రి..

## ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ



**నల్లమాడ (తెలుగోడు), మార్చి 14 :**

కష్టాల్లో ఉన్న కుటుంబాలు అధైర్యపడకూడదని, అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి భరోసా ఇచ్చారు. శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండలంలో పలు బాధిత కుటుంబాలను శనివారం పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న పులగంపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గంగాద్రి (గంగప్ప) కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ కాలు కోల్పోయిన గంగప్ప ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కదిరిలో నిర్వహించిన కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం సందర్భంగా ప్రమాదానికి గురై కాలు గాయపడిన గంగప్ప కుమారుడు పవన్ పరిస్థితిని కూడా కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబానికి ఇల్లు, పెన్షన్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కూడా ఆర్థిక



సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ మహిళా కార్యకర్త, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు వెంకట లక్ష్మమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచాన విశ్రాంతి తీసుకుంటున్న ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సలహా మేరకు చికిత్స కొనసాగించాలని సూచించారు. కురుమాల పంచాయతీ గంగాపురానికి చెందిన ఈశ్వరయ్య కుటుంబాన్ని కూడా పరామర్శించి వారికి కొంత ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదే విధంగా నల్లమాడలో నివాసం ఉంటున్న బొంతలపల్లికి చెందిన పవన్‌పై ఇతరులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటనపై స్పందించారు. గాయపడిన పవన్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించాలని అక్కడి కార్యకర్తలకు సూచించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా నల్లమాడ మండల కేంద్రంలోని షాదీ మహల్‌లో తెలుగుదేశం పార్టీ నాయకుడు రంగా నాయక్ కుమార్తె శ్రావణి, గణేశ్ నాయక్ వివాహ కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గడ్డం రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బాస్ ఖాన్, విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మయ్య, మైలే రాంచంద్ర, డాక్టర్ బుట్టి నాగభూషణం, కేశవరెడ్డి, రాయుడు, మంజూ, సలాంఖాన్, బాబావలి ఖాన్, శివారెడ్డి, తదితర కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల పరిరక్షణే లక్ష్యం

**పాడేరు (తెలుగోడు), మార్చి 14 :**

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి, గిరిజన హక్కుల పరిరక్షణెళి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పాడేరు నియోజకవర్గం, నందిగరువు గ్రామంలో శనివారం నిర్వహించిన 'గిరిజనులతో మాటామంతి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'డోలి మోత'లతో ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామం నుంచి మర్పు మొదలు కావాలని, అందుకే ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'సమస్యలు ఏవైనా రాత్రికి రాత్రే పరిష్కారం కావు, కానీ పరిష్కరించాలనే సంకల్పం మాకుంది. ప్రధానమంత్రి నిధులతోనే ఈ ప్రాంతంలో రోడ్ల నిర్మాణం సాధ్యమైంది. గత ప్రభుత్వంలో ఈ నిధులు ఏమయ్యాయో మీరు నాయకులను నిలదీయాలి. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికే 460 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాం, పార్టీలతో సంబంధం లేకుండా నిధులు కేటాయిస్తున్నాం. నాయకులకు ఈ ప్రాంతాలకు రావాలంటేనే భయం, కానీ నేను ప్రజల కోసం పనిచేసే వ్యక్తిని కాబట్టి ఎవరికీ భయపడను. మీ సమస్యలు



తెలుసుకోవడానికి ముందుకు వచ్చానని' ఆయన అన్నారు. నందిగరువు గ్రామస్తుల విన్నపం మేరకు కొత్త పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, 1.6 కిలోమీటర్ల మేర నూతన రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామంలో మ్యాజిక్ డ్రైన్లు మంజూరు చేశారు. అలాగే, సుమారు 3 వేల గ్రామాలకు తాగు నీరు అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధికి కీలకమైన జీవో నెంబర్ 3 పునరుద్ధరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు.




# ముజ్తబా ఆచూకి చెబితే 10 మిలియన్ డాలర్లు

(మొదటి పేజీ (తరువాయి)

ఆయనకు సంబంధించిన కీలక సమాచారం కానీ అందించిన వారికి భారీ రివార్డు ప్రకటించింది. ఆచూకీ ఇచ్చిన వారికి 10 మిలియన్ డాలర్లు అంటే రూ.92 కోట్లు నజరానా ఇస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. 'రివార్డ్ ఫర్ జస్టిస్' కార్యక్రమం క్రింద ఈ బౌంటీ ఇస్తామని తెలిపింది. అమెరికా విదేశాంగ నిర్వహించే ఒక ముఖ్యమైన ఉగ్రవాద నిరోధక కార్యక్రమమే 'రివార్డ్ ఫర్ జస్టిస్'. ఈ ప్రోగ్రాం కింద అంతర్జాతీయ నేరస్తులు, నెట్‌వర్క్‌ల సమాచారం అందించి, వారిని పట్టుకోవడంలో సహాయపడిన వారికి మిలియన్ డాలర్ల రివార్డు ఇస్తుంటారు. అమెరికన్ల రక్షణ, జాతీయ భద్రత బలోపేతం చేయడమే ఆర్ఎఫ్‌జే లక్ష్యం. కాగా, అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించిన వ్యక్తుల జాబితా ముజ్తాబాతో పాటు ఆయన కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అలీ అస్గర్ హెజాజీ, సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ అలీ లారీజానీ, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. ఆచూకీ తెలిపిన వారికి రివార్డుతో పాటు వారిని వేరే ప్రాంతానికి తరలించే సదుపాయం కూడా కల్పిస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది.

# ఇరాన్ దాడులతో దుబాయ్ అతలాకుతలం

(మొదటి పేజీ (తరువాయి)

బోసిపోయింది. చాలా ప్రాంతాల్లో షాపింగ్ మాల్స్, వాణిజ్య సంస్థలను మూసేశారు. రోడ్లపై జనసంచారం లేదు. నిత్యం పర్యాటకులతో కళకళలాడే బీచ్‌లు ఖాళీగా కనిపిస్తున్నాయి. బుర్జ్ అల్ అరబ్ సహా పలు ప్రముఖ హోటళ్లు క్షిపణి దాడులకు గురి కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. చాలా మంది దేశం విడిచి వెళ్లిపోయారు. విమాన సర్వీసులు భారీగా రద్దవ్వడంతో పర్యాటక రంగమూ కుదేలైంది. డిమాండ్ పెంచడానికి హోటళ్లు భారీ డిస్కౌంట్లు ఇస్తున్నా స్పందన లేదు. సిటీ, స్టాండర్డ్ చార్టెర్డ్ తదితర అంతర్జాతీయ బ్యాంకులు తమ కార్యాలయాలను ఖాళీ చేశాయి. వీధుల్లో జనసంచారం కనిపించడం లేదు.

# పశ్చిమాసియా యుద్ధంపై భయపడొద్దు

(మొదటి పేజీ (తరువాయి)

చెబుతున్నారు. దీంతో అస్సాం, మేఘాలయ రాష్ట్రాల మధ్య రవాణా వ్యవస్థ వేగవంతం కావడంతో పాటు మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాలకు కూడా సులభంగా ప్రయాణించే అవకాశం ఏర్పడనుంది. ఈ ప్రాజెక్టు ఉత్తర తూర్పు ప్రాంత ఆర్థిక అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సిల్చార్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ ఉత్తర తూర్పు రాష్ట్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రహదారులు, రవాణా, మౌలిక వసతులు మెరుగుపడితే పరిశ్రమలు, వాణిజ్యం, పర్యాటక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. దేశవ్యాప్తంగా రైతులకు అందిస్తున్న పీఎం కిసాన్ పథకం కింద మరో విడత నిధులను కూడా ఈ సందర్భంగా విడుదల చేశారు. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన వివరించారు. ఉత్తర తూర్పు ప్రాంతాన్ని దేశ అభివృద్ధిలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

# పాడేరులో జనసేన ఆవిర్భావ వేడుకలు

(మొదటి పేజీ (తరువాయి)

పవన్ కళ్యాణ్ హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, సుందరపు విజయ్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్ కుమార్ తదితరులు పవన్‌ను కలిసి స్వాగతం పలికారు. తరవాత హెలికాప్టర్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరుకు బయలుదేరారు పవన్. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ పర్యటన జరగనుంది. పాడేరు నియోజకవర్గం నందిగరువు గ్రామంలో గిరిజనుల మధ్య ఈ వేడుకలు నిర్వహించనున్నారు. పాడేరులో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించి, ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద 'అడవితల్లి బాట' పేరిట నిర్మించిన రహదారులను డిప్యూటీ సీఎం పరిశీలించనున్నారు. ఆపై నిర్మాణం పూర్తయిన రహదారులను పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్నారు. అనంతరం గిరిజనులతో 'మాటా-మంతి' కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలను తెలుసుకుని చర్చించనున్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.

# వంటగ్యాస్ సమస్య రానివ్వద్దు

(మొదటి పేజీ (తరువాయి)

సమన్వయం చేసుకుని సమస్య లేకుండా ప్రయత్నం చేయాలని ఆదేశించారు. హోటళ్లు సహా భాగస్వామ్య పక్షాలతో మాట్లాడి.. వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలని మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా చూడాలని మంత్రులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్యాబినెట్ సబ్ కమిటీలో మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు ఉన్నారు.

# గ్యాస్ సంక్షభం రాకుండా చర్యలు

(మొదటి పేజీ (తరువాయి)

ఇదిలావుంటే శనివారం ఉదయం సింహాచలం అప్పన్న స్వామిని హోం మంత్రి అనిత దర్శించుకున్నారు. చందనోత్సవం, స్వామివారి కళ్యాణోత్సవం నేపథ్యంలో అధికారులు, అర్చకులతో ఏర్పాట్లపై చర్చించారు. గత సంవత్సరం చందనోత్సవానికి 1,20,000 మంది భక్తులు స్వామివారి దర్శనానికి రావడం జరిగిందని హోంమంత్రి తెలిపారు. ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ఈనెలాఖరిలో మంత్రుల బృందం చందనోత్సవం ఏర్పాట్లపై సమీక్షించనున్నట్లు తెలిపారు. సామాన్య భక్తుల దర్శనానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

# సోనమ్ వాంగ్ చుక్‌కు స్వేచ్ఛ

(మొదటి పేజీ (తరువాయి)

ఈ ఆందోళనలు జరిగాయని కేంద్రం వెల్లడించింది. ఈ క్రమంలోనే జాతీయ భద్రత చట్టం కింద అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. శాంతి భద్రతలను కాపాడాలనే ఉద్దేశంతో కస్టడీలోకి తీసుకున్నట్లు హోంశాఖ ప్రకటనలో వెల్లడించింది. లద్దాఖ్‌లో శాంతికి కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. ఈ క్రమంలో వాంగ్‌చుక్ నిర్బంధాన్ని తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొంది. అయితే, ప్రస్తుతం కొనసాగుతున్న బంద్‌లు, నిరసనల వాతావరణం శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నాయని అభిప్రాయపడింది.

# అమరావతి గ్రామాల్లో పర్యటించిన మంత్రి

(మొదటి పేజీ (తరువాయి)

నారాయణ ప్రసంగించారు. మౌలిక సదుపాయాల కల్పనపై, గ్రామసభల నిర్వహణపై దృష్టిపెట్టామని చెప్పుకొచ్చారు. ఏపీ రాజధాని 2027 జూన్ నాటికి రాజధానిలో 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్డు,1500 కిలోమీటర్ల లేట్ అవుట్ రోడ్లు పూర్తి అవుతాయని వెల్లడించారు. అమరావతిలో శరవేగంగా ఐకానిక్ భవనాల పనులు జరుగుతున్నాయని తెలిపారు. 2028 డిసెంబర్ నాటికి ఐకానిక్ భవనాలు పూర్తి అవుతాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.


రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి

# రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ

**ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 14 :**
స్థానిక యల్లనూరు రోడ్డులో రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాడిపత్రి పట్టణంలో 49 కోట్లతో నిర్మించ తలపెట్టిన యల్లనూరు రోడ్డు రైల్వే బ్రిడ్జికీ భూమి పూజ చేశామని తెలిపారు. ఈ రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో ట్రాఫిక్ సమస్యలు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రిడ్జి కాంట్రాక్టర్లు, టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.


రాయల చెరువు గ్రామపంచాయతీలో ఇంటి పన్ను వసూళ్లను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శివశంకర్

# ఇంటి పన్ను వసూళ్ల పరిశీలన

**జడ్పీ సీఈవో శివశంకర్..**

**యాడికి (తెలుగోడు), మార్చి 14 :**
యాడికి మండల పరిధిలోని గ్రామపంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు విధానాన్ని శనివారం అనంతపురం జిల్లా పరిషత్ సీఈవో శివశంకర్ పరిశీలించారు. రాయలచెరువు గ్రామపంచాయతీలో ఇంటి పన్నుల వసూలు అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు ప్రజలు త్వరగా చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని జడ్పీ సీఈవో శివశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట యాడికి మండల ఎంపిడిఓ వీర్రాజు, కార్యదర్శి అరుణ్ , బిల్ కలెక్టర్ వలి పాల్గొన్నారు.

# పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం

**ఎంఈఓ కాశప్ప..**

**యాడికి (తెలుగోడు), మార్చి 14 :**
యాడికి మండలంలో ఈనెల16 నుంచి 31 వరకు జరగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసారు. మండలంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాశాఖ అధికారి కాశప్ప తెలియజేశారు. మండలంలో యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-ఏ, యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల- బితో పాటు ప్యారడైజ్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అయన తెలిపారు. యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల- ఏ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్‌గా సుబ్రమణ్యం, యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల -బి కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా మనోహర్ రెడ్డి, ప్యారడైజ్ పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్‌గా శ్రీనివాసారెడ్డి ని నియమించామన్నారు. యాడికి జిల్లా పరిషత్ పాఠశాల-ఏ సెంటర్‌లో 260 మంది విద్యార్థులు. యాడికి జిల్లా పరిషత్ పాఠశాల -బి సెంటంలో 263 మంది విద్యార్థులు , ప్యారడైజ్ పాఠశాల సెంటర్‌లో 227 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నామన్నారు. మొత్తం మూడు సెంటర్లకు 750 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్ష రాయనున్నారని మండల విద్యాశాఖ అధికారి కాశప్ప తెలిపారు. విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందుగానే మండల విద్యాశాఖ అధికారి ఆయా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు సరిపడా టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. తగినంత వెలుతురు గాలి ఉండేటట్లు కిటికీలు ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేసామన్నారు. విద్యార్థులు తాగడానికి మంచినీరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల జరుగుతున్న సమయంలో విద్యార్థులకు వైద్య పరమైన సహాయాన్ని అందించేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు.


పరీక్ష కేంద్రాలకు టేబుళ్లను తరలిస్తున్న ఎంఈఓ కాశప్ప

# ఆలూరు లక్ష్మి నరసింహ శాస్త్రికి ఆత్మీయ సత్కారం

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 14 :**
నగరంలోని ఆర్ ఎఫ్ రోడ్డు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దశాబ్దాల కాలంగా ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్న ఆలూరు లక్ష్మీ నరసింహ శాస్త్ర డాక్టరేట్ అవార్డు తీసుకున్న నేపథ్యంలో ఆలయంలోని కళ్యాణ మండపం ప్రాంగణంలో ఆత్మీయ సత్కారం ఆశీర్వాదాలు అభినందనలతో సాగింది. జిల్లాలోని బ్రాహ్మణ సమైక్య సంఘం , వివాహ పరిచయ వేదిక సభ్యులు ఆయనకు పేట శాలువాలతో, పూల హారాలతో సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఏఎల్ఎన్ శాస్త్రి మాట్లాడుతూ డాక్టరేట్ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది అని, ఈ అవార్డు రావడానికి అన్ని బ్రాహ్మణ సంఘాలు దశాబ్దాల నుండి సహాయ సహకారం చేస్తున్నారన్నారు. భగవంతుని ఆశీస్సులతో అర్చకత్వంతో పాటు, ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని తెలిపారు.. కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరి ప్రసాద్, తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




ఏఎల్ఎన్ శాస్త్రికి ఆత్మీయ సత్కారం చేస్తున్న కమిటీ సభ్యులు

# ఉపాధి పనుల్లో బినామీల సునామీ!

**ఉపాధి పథకం.. అవినీతిమయం..**
**కళ్లప్పగించి చూస్తున్న అధికార గణం..**
**తూతూ మంత్రంగా సామాజిక తనిఖీలు..**
**యాడికిలో ప్రారంభమైన**
**18వ విడత సామాజిక తనిఖీలు. .**

**యాడికి (తెలుగోడు), మార్చి 14 :**
వ్యవసాయ కూలీలకు ఉన్నచోటనే ఉపాధి కల్పించి, వలసలను నివారించాలనే ఉద్దేశంతో పురుడు పోసుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుతీరు రోజు రోజుకు నిరాశాజనకంగా మారుతోంది. పారదర్శకత, జవాబుదారీతనం లోపించడంతో బినామీల నమోదు సునామీని తలపిస్తోంది. ఆ ప్రభుత్వం, ఈ ప్రభుత్వం అనే తేడా లేకుండా వేతన దోపిడీ యథేశ్చగా సాగుతోంది. స్థానిక రాజకీయానికి జడిసిన అధికార గణం కళ్లప్పగించి చూడటం తప్ప కనీసం నిలువరించే ప్రయత్నం కూడా ఆ చేయలేని దుస్థితి నెలకొంది. అవినీతి పేట్రేగి పోతున్న ఉపాధి పనుల్లో పారదర్శకతను వరిశీలించడానికి ఎప్పటికప్పుడు చేపట్టే సామాజిక తనిఖీలు కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేని స్థితికి దిగజారుతున్నాయి. కష్టమొకరిది.. కాసులొకరివి అన్నట్లు కష్టజీవుల సొమ్ము కొందరు క్షేత్రసహాయకులు, నేతల అనుయాయుల ఖాతాల్లో చేరిపోతోంది. నేతల సిఫార్సులతో విధుల్లో చేరిన కింది స్థాయి సిబ్బంది నేతలను ప్రసన్నం చేసుకోవడానికి వారు సూచించిన బినామీలకు హాజరు వేసి వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమచేస్తున్నారు. ఉపాధి పనులు ఎక్కడ జరుగుతున్నాయో కూడా తెలియని వారిని కూలీలుగా నమోదు చేసి నీకింత.. మాకింత అంటూ కొందరు సిబ్బంది సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి అక్రమాలను అధికారులు పట్టించుకోక పోవడంతో మరింత రెచ్చిపోయి పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేస్తున్నారు.

యాడికి మండలంలో 9,327 జాబ్ కార్డులుండగా అందులో 7,250 కార్డులున్న కుటుంబాలు మాత్రమే చురుగ్గా పనిచేస్తున్నాయి. వీటికి సంబంధించి 12,832 మంది కూలీలకు ఈ పథకం ఉపాధి చూపుతోందని గణాంకాలు చెబుతున్నా వీరిలో బినామీల తాకిడే ఎక్కువగా ఉందని తెలుస్తోంది. పేదలు కష్టపడి పనిచేస్తే పనులకు వెళ్లని గ్రామస్థాయి నేతల అనుచరుల కుటుంబ సభ్యుల ఖాతాల్లో సొమ్ములు పడుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు మండల స్థాయి అధికారులతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది, కొందరు కార్యాలయ సిబ్బంది సహకారం కూడా మెండుగా ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. వీరంతా ఆరగించే క్రమంలో నాయకుల ప్రసన్నం కోసం దోచిపెడుతున్నారు. తనిఖీలున్నా


ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారి


ఉపాధి కూలీ డబ్బులు పడలేదని ఏపీవో మద్దిలేటిని అడుగుతున్న మహిళలు

పట్టించుకునే దిక్కులేకుండా పోతోంది. యాడికి మండలంలో ఇటీవల ఓ క్షేత్రసహాయకుని నియామకం సర్వత్రా ఎంత చర్చనీయాంశంగా మారిందో.. అతను స్వతహాగా విధుల నుంచి తప్పుకోవడం కూడా అంతే చర్చనీయాంశంగా మారింది. దీని వెనుక వందలాది మందికి పైగా బినామీలను చేర్చినా ఇంకా చేర్చాలని స్థానిక నాయకులు పట్టు పట్టడమే కారణమని తెలుస్తోంది. తానే భయాందోళనకు గురై విధుల నుంచి తప్పుకున్నట్లు క్షేత్రసహాయకుడు చెప్పుకోవడం విశేషం, మండల పరిధిలోని ఓ మాజీ ప్రజా ప్రతినిధికి చెందిన గ్రామంలో అసలైన ఉపాధి కూలీల కంటే బినామీల సంఖ్యే ఎక్కువగా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఇవిగో తార్కాణాలు..**

ఉపాధి పనులకు వెళ్లకపోయినా యాడికిలో ఓ రంగుల అద్దకం ఫ్యాక్టరీ ఉన్న వ్యక్తి కుటుంబానికి రూ.12,500 లబ్ధిచేకూర్చారు. మండలంలోని ఓ కేబుల్ ఆపరేటర్ కుటుంబానికి పనులకు వెళ్లకపోయినా 63 రోజులు వారు పనులకు వెళ్లినట్లు చూపించి రూ.18 వేలు లబ్ధిచేకూర్చారు. పనుల ప్రదేశమే తెలియని మెకానిక్ కుటుంబానికి 72 రోజుల పనిదినాలు కల్పించి రూ.21 వేలు లబ్ధి చేకూర్చారు. ఓ స్టోర్ డీలర్ భార్య పనులకు వెళ్లకపోయినా 95 రోజుల వనిదినాలకు రూ.26 వేలు, 28 రోజుల పనిదినాలకు రూ.7,600లు లబ్ధి చేకూర్చారు. ఓ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహకురాలు పేరుతో కూడా ఉపాధి సొమ్మును సిబ్బంది స్వాహా చేస్తున్నారు.

ఓ పెట్రోల్ బంకు వద్ద హోటల్ నిర్వహకుని ఇద్దరు కుటుంబసభ్యుల పేరుతో రూ.11,400లు సిబ్బంది స్వాహా చేసినట్లు సమాచారం. యాడికిలోని ఓ వీధిలో బినామీ కూలీలకు అందిన సొమ్ములో తన వాటాను ఇవ్వలేదని ఓ దళారి ఆ బినామీ కూలీ కుటుంబంతో వాగ్వాదానికి దిగడం, అది కాస్తా రచ్చకెక్కడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పనులకు వెళ్లని కూలీల వద్దకు వెళ్లి, వారిపై ఒత్తిడి తెచ్చి, ఆకదూపి బినామీలుగా చేర్చి కొందరు సిబ్బంది తమ పబ్బం గడుపుకుంటున్నట్లు చర్చ నడుస్తోంది. పల్లెల్లో జరుగుతున్న సామాజిక తనిఖీల్లో ఇదే విషయాలు ప్రస్తావించినా పట్టించుకునే నాథుడే లేకపోవడం గమనార్హం. వాస్తవంగా కూలీ పనుల్లో నిమగ్నమైన వారిలో 70 శాతం మాత్రమే ఉండగా మిగిలిన వారంతా బినామీలేననేది బహిరంగ రహస్యం. ఈ సొమ్మంతా నేతల అడుగులకు మడుగులొత్తే వారి జేబుల్లోకి చేరుతోంది. ఇంత యథేశ్చగా అక్రమాలకు పాల్పడితే ఎలా అని ఎవరైనా అడిగితే ఆ ప్రభుత్వంలో దోచుకోలేదా.. మేము దోచుకుంటేనే కనిపిస్తోందా అంటూ ఎదురు ప్రశ్నిస్తుండటం గమనార్హం. ఈ అక్రమాలపై అధికారులనడిగితే ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామంటున్నారు తప్ప అడుగులు ముందుకు పడటం లేదు. ఈ పథకం పేరు మారిన అవినీతి తీరు మారకపోవడం విశేషం.

# నేడు ఆదోనిలో కాన్షీరాం జయంతోత్సవం

**బిఎస్పీ జిల్లా కమిటీ సభ్యుడు పి.ఎస్.హరి ప్రసాద్ ..**

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 14 :**
బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఆదోనిలో కాన్షీరాం జయంతి మహాసభ నిర్వహిస్తున్నట్లు బిఎస్పీ అనంతపురం జిల్లా కమిటీ సభ్యుడు, న్యాయవాది పి.ఎస్.హరి ప్రసాద్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆదోని పట్టణంలోని ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్‌లో జరుగనున్న కాన్షీరాం సాహెబ్ జయంతి సభకు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. బాహుజన్ సమాజానికి మాస్టర్ కీ అందించిన మహానుభావుడు కాన్షీరాం అన్నారు. ఆయన త్యాగం, దూరదృష్టి, "జిస్కీ జిత్నీ సంఖ్యా భారీ, ఉస్కీ ఉత్నీ హిస్సేదారీ" (మేమంతో మాకు అంత వాటా) అనే సిద్ధాంతం ఇవన్నీ మన బాహుజన్ సమాజాన్ని బానిసత్వం నుంచి విముక్తి చేసి, రాజకీయ శక్తిగా మార్చాయన్నారు. బహుజన సమాజ్ పార్టీ బహుజన్ సమాజానికి స్వాభిమానం, సమానత్వం, రాజకీయ శక్తిగా మార్చిన మార్గదర్శకుడు అన్నారు. ఆయన మిషన్ ఇంకా అసంపూర్తిగా ఉందని, మనమంతా కలిసి దాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ మహా సభలో మన సాహెబ్ జీవిత చరిత్ర, సిద్ధాంతాలు, బాహుజన్ ఉద్యమం గురించి చర్చలు, భక్తి గీతాలు, ప్రసంగాలు ఉంటాయన్నారు. భారీ సంఖ్యలో హాజరై, మన ఐక్యతను చాటాలన్నారు. కాన్షీరాం ఆశయాలు సాకారం కావాలంటే బిఎస్పీ బలోపేతం చేయాలన్నారు.



# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**యాడికి (తెలుగోడు), మార్చి 14 :**
తెరనపల్లి 220 కెవిఎ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. తాడిపత్రి పట్టణం, తాడిపత్రి, యాడికి పరిసర ప్రాంతాల గ్రామ గృహాలకు పరిశ్రమలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.


యువకవి, రచయిత శీర్పి చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న విశ్వసాహితీ కళావేదిక, వేమన కవితామయం సభ్యులు

# యువకవి, రచయిత శీర్పి చంద్రశేఖర్‌కు ఘనసత్కారం

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 14 :**
బెళుగుప్ప మండలం పరిధిలోని శీర్పి గ్రామానికి చెందిన యువ కవి, రచయిత శీర్పి చంద్రశేఖర్ కు ఘన సత్కారం లభించింది. శనివారం శ్రీకాకులం జిల్లాలో విశ్వసాహితీ కళా వేదిక, వేమన కవితా మయం ఆధ్వర్యంలో జరిగిన ఉగాది తెలుగు సాహితీ ప్రతిభా పురస్కారాల ప్రధాన సభలో శీర్పి. చంద్రశేఖర్ రచనా శక్తిని సృజనాత్మకతని మరియు అతను రాసిన నాలుగు పుస్తకాలను అభినందిస్తూ ఘన సత్కారాన్ని అందజేశారు. ప్రముఖ కవులు, మేధావులు, రచయితలు చంద్రశేఖర్ ను ప్రశంసించారు. కవిత్వం నా అలవాటు కాదు నా బాధ్యత అని చంద్రశేఖర్ తోటి కవులతో పేర్కొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్

# హనుమాన్ జయంతి బైక్ ర్యాలీకి రండి

**మంత్రి సత్య కుమార్‌యాదవ్‌కు ఆహ్వానం**
**జైశ్రీరామ్ భక్తమండలి సభ్యులు..**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 14 :**
తాడిపత్రి పట్టణంలో ఏప్రిల్ 2న నిర్వహించనున్న హనుమాన్ విజయయాత్ర భారీ బైక్ ర్యాలీకి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను జైశ్రీరామ్ భక్తమండలి సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. అనంతపురంలోని మంత్రి కార్యాలయంలో శనివారం జై శ్రీరామ్ భక్తమండలి అధ్యక్షుడు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ ను కలిసి ర్యాలీ వివరాలను తెలియజేసి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరారు. హనుమాన్ విజయయాత్ర బైక్ ర్యాలీ సందర్భంగా ప్రతి సంవత్సరం యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని, ఈసారి మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. యువతలో భక్తి భావాన్ని పెంపొందించడం మరియు హిందువుల ఐక్యత లక్ష్యంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, తప్పకుండా ఈ కార్యక్రమంలో పాల్గొంటానని తెలిపారు. యువతలో దేశభక్తి మరియు ధార్మిక స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ ర్యాలీ ప్రేరణాత్మకంగా ఉంటుందని పేర్కొన్నారు. హిందువులలో ఐక్యత, ధార్మిక చైతన్యం పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం జై శ్రీరామ్ భక్తమండలి సభ్యులు మంత్రి సత్యకుమార్ యాదవ్ కు శాలువా కప్పి సన్మానించి, హనుమంతుని చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేసి, ర్యాలీ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్, ఓబీసీ మోర్చా సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జ్ యల్లన్నగారి రామాంజనేయులు, జైశ్రీరామ్ భక్తమండలి సభ్యులు పోతుల గంగాధర్ యాదవ్, నారాయణస్వామి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న జైశ్రీరామ్ భక్తమండలి సభ్యులు


మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న జైశ్రీరామ్ భక్తమండలి సభ్యులు

# శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**యాడికి (తెలుగోడు), మార్చి 14 :**
యాడికి మండల పరిధిలోని కమలపాడు పంచాయితీ చింతలాయిపల్లి సమీపంలో ఉన్న స్వయంభువుగా వెలసిన శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి(కొత్త రాయుడుసామి)కి శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు శనివారం ఉదయం ధన్యాధివాసం, పంచామృతాభిషేకం, నవగ్రహ ఆవాహిక దేవత జపములు, వేద పారాయణం, మహావిష్ణు సుదర్శన హోమం, మంత్రపుష్పం, మహా మంగళహారతి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ గంగవరం కుటుంబ సభ్యులు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 7 గంటల నుండి ధ్వజస్తంభ పునర్నిర్మాణం, వినాయకుడు, హనుమంతుడు, గరుత్మంతుడు, శంకుచక్ర నామాలు, బలిపీఠం, జయ విజయల విగ్రహాల ప్రతిష్టాపన ఉంటాయి. భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అభివృద్ధి కమిటీ వారు కోరారు.




ఆలయంలో నూతన ధ్వజస్తంభం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం


నూతన విగ్రహాలకు పూజలు నిర్వహించిన దృశ్యం


ఆలయంలో నూతన ధ్వజస్తంభానికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం



# గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందవద్దు

తహసీల్దార్ స్వర్ణలత..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 14 :**
బత్తలపల్లి మండలంలోని గ్యాస్ వినియోగదారులు సిలిండర్ల సరఫరాపై ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ స్వర్ణలత తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 12 వేల గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని ఆమె వెల్లడించారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల తర్వాత, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాత మాత్రమే రీఫిల్ సిలిండర్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. గ్యాస్ ఏజెన్సీల వద్ద అనవసరంగా గుమిగూడకుండా వినియోగదారులు సహకరించాలని తహసీల్దార్ కోరారు.



# రేపటి నుంచి ఒంటిపూట బడులు

ఎంఈఓ సుధాకర్ నాయక్..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 14 :**
ఎండల తీవ్రత దృష్ట్యా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయని ఎంఈఓ చాముండేశ్వరి, ఎంఈఓ సుధాకర్ నాయక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు వెల్లడించారు. శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని పాఠశాలలకు సూచించినట్లు తెలిపారు. ఈ పనివేళలు ఏప్రిల్ 23 వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు తాగునీరు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని కూడా ఆదేశించారు. అదేవిధంగా, పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం 1.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పాఠశాలలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



శ్రీ మత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ మంత్రి రఘువీర రెడ్డి గారి మనవడి కేశఖండన కార్యక్రమంలో పాల్గొని ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్న కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్

# గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందవద్దు

ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ అశోక్

**అగళి (తెలుగోడు), మార్చి 14 :**
అగళి మండలంలోని ఇండియన్ గ్యాస్ వినియోగదారులు సిలిండర్ల సరఫరాపై ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నిబంధనల ప్రకారం బుక్ అయిన ప్రతి ఒక్కరికి గ్యాస్ అందుబాటులో ఉందని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అశోక్ తెలిపారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్లు అందుబాటు లో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల తర్వాత,పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాత మాత్రమే రీఫిల్ సిలిండర్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకుని ఓటిపి వచ్చిన వినియోగదారులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. సర్వర్ సమస్యల వల్ల కొంచెం ఆలస్యం కావచ్చు కానీ సరఫరాలో సమస్య ఉండదన్నారు. అనవసరంగా వినియోగదారులు ఎటువంటి అనుమానాలు పెట్టుకొని ఆందోళన చెందకుండా సహకరించాలని కోరారు



గ్యాస్ సిలిండర్లు నిల్వ చేస్తున్న దృశ్యం



శిక్షణ ఇస్తున్న జె.ఎస్. లింగేష్. జాతీయ విద్యా విధానం శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఆచార్యులు.

# విద్యార్థుల్లో వ్యక్తి నిర్మాణం జరగాలి

## జాతీయ విద్యా విధానంపై సదస్సు ..

**అమరాపురం (తెలుగోడు), మార్చి 14 :**
విద్యార్థులలో వ్యక్తి నిర్మాణం, దేశ సంస్కృతి జాతీయ అభిమానం, మానవీయ విలువలు నిర్మాణం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. అమరాపురంలోని శ్రీ సరస్వతీ విద్యా మందిరంలో శనివారం జాతీయ విద్యా విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీనివాసమూర్తి మార్గదర్శనంలో పాఠశాల ఉపాధ్యాయులు, మడకశిర పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్య వ్యక్తి పరివర్తన, సామాజిక పరివర్తన కోసం ఉపయోగపడాలన్నారు. ప్రస్తుత విద్యా విధానం ద్వారా విలువల నిర్మాణం కావడం లేదన్నారు. మెకాలే విద్యా విధానం కొనసాగటం వల్లనే ఈ దుస్థితి దాపరించిందన్నారు. విద్యా విధానంలో మార్పురావాలని అన్నారు. భారతీయ సంస్కృతి, ధర్మం, జీవన మూల్యాలు ప్రతిబింబించే విధంగా జాతీయ విద్యా విధానం రూపకల్పన కావాలన్నారు. జాతీయ విద్యా విధానం కోసం 1952 నుండి



ఉపాధ్యాయులకు చిరు సత్కారం చేస్తున్న శ్రీనివాస్ మూర్తి



జాతీయ విద్యా విధానంపై మార్గదర్శనం చేస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాసమూర్తి

దేశంలో విద్యా భారతి మార్గదర్శనంలో శ్రీ సరస్వతీ శిశు మందిరాలు అన్ని రాష్ట్రాలలో పనిచేస్తున్నాయన్నారు. విద్యాభారతి లక్ష్యం కేవలం శిశు మందిరాలు నిర్వహించడమే కాదని, విద్యారంగంలో భారతీయతను ప్రతిబింబిస్తూ విద్యార్థులో సమగ్ర వికాసం తీసుకురావడానికి కృషి చేస్తోందన్నారు. ఆ ప్రయత్నమే విద్యా భారతి విభాగమైన విద్వత్ పరిషత్ పని అన్నారు. దేశ సంస్కృతి, జాతీయత పట్ల భద్రత, భారతీయ జీవన దర్శనం మానమీయ విలువలను విద్యార్థులలో నిర్మాణం చేయడంలో అనురక్తి, అభిరుచి ఆసక్తి కలిగిన మేధావులు, విద్యావేత్తలను విద్యారంగంలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయవర్గాన్ని, విద్యారంగం గురించి ఆలోచన చేస్తున్న సామాజిక కార్యకర్తలను భాగస్వామ్యులను చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు వీరకేతన్, సమితి కార్యదర్శి నాగభూషణ్, జిల్లా సేవా ప్రముఖ ఎల్.లింగేష్ , పాఠశాల కార్యదర్శి పి.బాలాజీ రావు, పాఠశాల ప్రధానాచార్యులు కలవటాల మురళీ కృష్ణ పాల్గొన్నారు. అమరాపురం, మడకశిరలో పనిచేయుచున్న ఉపాధ్యాయ బృందానికి చిరు సత్కారాన్ని చేశారు. ఉపాధ్యాయ బృందాన్ని ప్రోత్సహించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు.



అమరాపురం శ్రీ సరస్వతి విద్యా మందిరం ప్రధానోపాధ్యాయుడు కలవటాల మురళీకృష్ణకు సన్మానం చేస్తున్న దృశ్యం. మడకశిర ప్రాథమిక పాఠశాల ప్రధానాచార్యులు శ్రీమతి జయలక్ష్మికి చిరుసత్కారం చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మూర్తి

# ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**రొళ్ల (తెలుగోడు), మార్చి 14 :**
మడకశిర నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆపార్టీ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా జెండా వందనం చేసి, కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి మడకశిర నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త టి రంగస్వామి మడకశిర మండల అధ్యక్షులు శివాజీ, రాష్ట్ర దాసరి డైరెక్టర్ ఆనంద్ క్రిష్ణ, మడకశిర టౌన్ ఉపాధ్యక్షులు పవన్ కళ్యాణ్, ఐటీ ప్రసాద్, కుమార్, రాఘవేంద్ర,అగళి మండల ఉపాధ్యక్షులు ఈరేగౌడ, రఘు, నాగరాజు, సురేష్ ,తదితరులు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవం జరుపుకొంటున్న జనసేన నాయకులు



జనసేన పార్టీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

# గ్రామాల్లో నీటి ఎద్దడిని గుర్తించి తక్షణ చర్యలు

## ప్రజలు ఇబ్బంది పడకూడదు.. కుటాలపల్లిఎస్సీ కాలనీలో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా కుటాలపల్లి తండాలో మారెమ్మ ఆలయం వద్ద సౌకర్యాల కల్పన.. శ్మశానం దారికి మరమ్మతులు పూర్తి... సర్పంచ్ రమావత్ భారతి చాంప్లా నాయక్..

**నల్లమాడ (తెలుగోడు), మార్చి 14 :**
నల్లమాడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో తక్షణ చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ రమావత్ భారతి తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా నీటి కొరత తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల కుటాలపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సర్పంచ్ స్వయంగా పరిస్థితిని పరిశీలించారు. వెంటనే ట్యాంకర్ల ద్వారా



మారెమ్మ ఆలయం వద్ద పరిశుభ్రత చర్యలు చేపట్టిన దృశ్యం



కుటాలపల్లి ఎస్సీ కాలనీలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్న దృశ్యం

తాగునీటిని సరఫరా చేయించి ప్రజలకు ఉపశమనం కలిగించారు. వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఆమె వివరించారు.
అదేవిధంగా కుటాలపల్లి తండాలో నూతనంగా నిర్మించిన మారెమ్మ ఆలయం వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఆలయం పరిసరాల్లో పరిశుభ్రత, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. గ్రామ ప్రజలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకునేలా అనుకూల వాతావరణం కల్పించామని సర్పంచ్ తెలిపారు. అదే తండా పరిధిలో ఎవరైనా మృతి చెందినప్పుడు స్మశానానికి తీసుకెళ్లే దారి సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకొని ఆ మార్గాన్ని పూర్తిగా మరమ్మత్తులు చేయించారు. దీంతో గ్రామ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.
గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని సర్పంచ్ రమావత్ భారతి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ఎప్పటికప్పుడు కృషి చేస్తామని ఆమె తెలిపారు. స్థానిక ప్రజలు కూడా సర్పంచ్ చొరవను అభినందిస్తూ గ్రామాభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు.

# పదో తరగతి పరీక్షలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

జిల్లా వ్యాప్తంగా 107 కేంద్రాలు..
22,303 మంది విద్యార్థులు ..
జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్..

**పుట్టపర్తి (తెలుగోడు), మార్చి 14 :**
మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల దృష్ట్యా పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 107 పరీక్ష కేంద్రాలలో మొత్తం 22,303 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పటిష్టమైన పోలీస్ భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగనున్నాయని, విద్యార్థులు తమ హాల్ టికెట్లతో సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఇతర ఎవరూ కూడా పరీక్ష కేంద్రంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని తెలిపారు.
పరీక్షల సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద ప్రజలు గుంపులుగా తిరగడం నిషేధమని పేర్కొన్నారు. అలాగే పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఉన్న ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించినట్లు చెప్పారు. పరీక్షలకు సంబంధించి సోషల్ మీడియాలో ఎలాంటి అసత్య ప్రచారాలు జరిగినా నమ్మరాదని, పరీక్షలు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య జరుగుతాయని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు చేసే వ్యక్తులపై జిల్లా పోలీసు కేంద్రం నుంచి ప్రత్యేక నిఘా ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసుకునేలా అందరూ సహకరించాలని కోరారు..



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్

# జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం

**రొళ్ల (తెలుగోడు), మార్చి 14 :**
జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం రొళ్ళ మండలంలో నియోజకవర్గ సమన్వయ కర్త రంగస్వామి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి మడకశిర నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త టి రంగస్వామి రొళ్ళ మండలం ఉపాధ్యక్షులు గోపి,రమేష్, బాబు రెడ్డి నరసింహ మూర్తి, దోడ్డహనుమ,తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి దినోత్సవ వేడుకలను జరుపుకొంటున్న నాయకులు

# ధర్మవరంలో ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ధర్మవరం (తెలుగోడు), మార్చి 14 :**
ప్రశ్నించడం కోసం అనే నినాదంతో స్థాపించబడిన జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ధర్మవరం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన యువనాయకుడు సంకు అఖిల్ మాట్లాడుతూ, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ 2014లో ప్రజల సమస్యలను ప్రశ్నించేందుకు జనసేన పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. పార్టీ స్థాపన నుంచి దాదాపు పదేళ్లపాటు ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా పవన్ కళ్యాణ్ వెనుకడుగు వేయలేదని, తన లక్ష్యం వైపు ధైర్యంగా ముందుకు సాగారని తెలిపారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేనకు కేవలం ఒక్క ఎమ్మెల్యే మాత్రమే గెలిచారని, తరువాత ఆ ఎమ్మెల్యే కూడా పార్టీకి రాజీనామా చేయడంతో పార్టీ శూన్య స్థితికి చేరిందని చెప్పారు. అయినప్పటికీ పార్టీ అధినేత నిరుత్సాహపడకుండా కార్యకర్తలకు ధైర్యం నింపుతూ ముందుకు నడిపారని పేర్కొన్నారు.
2024 ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేశాయని తెలిపారు. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని స్థానాల్లో 100 శాతం స్ట్రైక్ రేటుతో విజయం సాధించి దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని వివరించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ధర్మవరం పట్టణంలోని పలు వీధుల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన జెండాలను ప్రదర్శిస్తూ, పార్టీ నినాదాలు చేస్తూ పట్టణమంతా సందడి చేశారు. “సాధించిన విజయాన్ని సగర్వంగా చాటుదాం... రానున్న కాలానికి దిశానిర్దేశం చేసుకుందాం... జాతీయ రాజకీయాల్లో తిరుగులేని బావుటా ఎగురవేద్దాం” అనే నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.
అల్లూరి జిల్లాలో గిరిజనుల మధ్య కూడా జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ధర్మవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



బైక్ ర్యాలీలో పవన్ చిత్రపటంతో సంకు అఖిల్



ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న నాయకులు

# ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కౌతాళం (తెలుగోడు), మార్చి 14 :**

జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జనసేన నాయకుడు రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాజకీయ యవనికపై 'ప్రశ్నించడానికే పుట్టాను' అంటూ అడుగుపెట్టిన జనసేన పార్టీ నేటితో 13వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. 2014 మార్చి 14న హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ పార్టీని స్థాపించినప్పుడు, అది కేవలం ఒక రాజకీయ ప్రత్యామ్నాయం మాత్రమే కాదు, వ్యవస్థలో మార్పు కోరుకునే లక్షలాది మంది యువత ఆశయాలకు ప్రతిరూపంగా నిలిచిందన్నారు. పవన్ కళ్యాణ్ తన సినీ గ్లామర్‌ను పక్కన పెట్టి, కేవలం సిద్ధాంతాలను నమ్ముకుని ఒంటరి పోరాటం మొదలుపెట్టారన్నారు. ప్రారంభంలో విమర్శలు ఎదురైనా, 'జవాబుదారీతనం' అనే నినాదంతో సామాజిక మార్పే లక్ష్యంగా జనసేన అడుగులు వేసిందన్నారు. జనసేన ప్రయాణం పూల బాట కాదని రుజువైందన్నారు. 2019 ఎన్నికల్లో ఎదురైన పరాజయం, రెండు చోట్లా పవన్ కళ్యాణ్ ఓడిపోవడం వంటి సంఘటనలు పార్టీ మనుగడపై ప్రశ్నలు రేకెత్తించాయన్నారు. అయితే, ఓటమిని చూసి కుంగిపోకుండా, పవన్ కళ్యాణ్ ప్రజల్లోనే ఉంటూ నిరంతరం వారి సమస్యలపై పోరాడారు. కౌలు రైతుల కన్నీళ్లు తూడ్చడం నుంచి ఉద్దానం కిడ్నీ బాధితుల వరకు ఆయన చేసిన పోరాటాలు జనసేనను ప్రజల గుండెల్లో బలంగా నాటాయన్నారు. పదేళ్ల ఓర్పు, క్రమశిక్షణతో కూడిన పవన్ కళ్యాణ్ రాజకీయ పరిణితి, 2024 ఎన్నికల్లో అద్భుతమైన ఫలితాలను ఇచ్చిందన్నారు పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయం సాధించి 100 శాతం స్ట్రైక్ రేట్‌తో దేశ రాజకీయాల్లోనే ఒక అరుదైన రికార్డును జనసేన సృష్టించిందన్నారు. ప్రస్తుతం జనసేన పార్టీ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంటూ, రాష్ట్ర అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక వీడియోలో "జనసేన లేకుండా తెలుగు రాష్ట్రాల రాజకీయాలు ఉండవు" అని పేర్కొనడం పార్టీ సాధించిన ప్రభావాన్ని స్పష్టం చేస్తోందన్నారు. కేవలం అధికారం కోసం కాకుండా, సామాజిక న్యాయం మరియు పారదర్శక పాలన కోసం జనసేన చేస్తున్న కృషి రాబోయే రోజుల్లో మరింత విస్తరించనుందన్నారు. ఒక సామాన్య పార్టీగా మొదలై, నేడు కింగ్ మేకర్‌గా ఎదిగిన జనసేన ప్రస్థానం భారత రాజకీయాల్లో ఒక విలక్షణమైన అధ్యాయంగా మిగిలిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజు, స్వామి దాసు, దేవదాసు, చూడి భీమేష్, చిన్న, మహబూబ్, కూటమి నాయకులు కురువ వీరేష్,రాజబాబు, ఉమేష్ గౌడ్, నాగిరెడ్డి,గోపాల్, ఎమ్మార్పీ పిఎస్ కౌతాళం మండల అధ్యక్షులు గుడికంబాలి ఆనంద్, కామవరం తిమోతి,బంటకుంట అల్లప్ప, సంపత్, మారేష్, అన్నమయ్య,తదితరులు పాల్గొన్నారు



ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న నాయకులు

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

**గుంటూరు, (తెలుగోడు), మార్చి 14 :**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 16వ తేదీన తుళ్లూరులో పర్యటించనున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఈ కార్యక్రమంలో భాగంగా తుళ్లూరులో ముఖ్యమంత్రి హాజరవుతున్నారు. తుళ్లూరులో ఆర్యవైశ్య ట్రస్టుకు ప్రభుత్వం కేటాయించిన 6.80 ఎకరాల స్థలంలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. ముఖ్యమంత్రి ఆర్యవైశ్య ట్రస్ట్ ఏర్పాటు చేసిన 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ప్రారంభిస్తారు. అచ్చట ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని సందర్శిస్తారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మొత్తం ఏర్పాట్లను పరిశీలించారు.. ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ మరియు ఆర్యవైశ్య ట్రస్ట్ ప్రెసిడెంట్ రూండి రాకేష్ వివరాలను అందిస్తూ పదివేల మంది కార్యక్రమానికి హాజరవుతారన్నారు. 120 రోజుల్లో ప్రస్తుత ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అదనపు ఎస్పీ ఏ టీవీ రవికుమార్, డిఎస్పి మురళీకృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ముస్లింలకు ప్రతిభ హైస్కూల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన దృశ్యం

# ప్రతిభ హైస్కూల్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు

**కౌతాళం (తెలుగోడు), మార్చి 14 :**

కౌతాళం మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్‌లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్విందు ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందులో మదిన,మజీద్, నూరాని మజీద్, జామియా మజీద్, అక్సా మజీద్, మస్జిదే ఖాదిర్, మస్జిద్లకు ముస్లిం సోదరులకు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులతో పవిత్రంగా ఉపవాసాలు ఉంటారు. ఈ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులకు ప్రతిభ హైస్కూల్ కరస్పాన్డెంట్ సయ్యద్ దూద్ భాష . కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ప్రతిభ హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముస్లింలకు ప్రతిభ హైస్కూల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన దృశ్యం

# ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపాలని టార్చిలైట్లతో నిరసన

## అమెరికా -ఇజ్రాయిల్ దాడులను ఖండించిన రైతు, కార్మిక సంఘాలు..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 14 :**

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు చేపడుతున్న యుద్ధ చర్యలను తక్షణమే నిలిపివేసి ప్రపంచ మానవాళి ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ శనివారం పెద్దకడబూరు మండల పరిధిలోని కల్లుకుంట, చిన్నతుంబళం గ్రామాలలో టార్చిలైట్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టారు.

ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తిక్కన్న, మండల అధ్యక్షులు శ్రీనివాసులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ ప్రపంచ శాంతిని భంగం చేస్తున్న అమెరికా - ఇజ్రాయిల్ యుద్ధ విధానాలను తీవ్రంగా ఖండించారు. యుద్ధాల వల్ల అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ దెబ్బతింటుందని, ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు



అమెరికా తీరును నిరసిస్తూ టార్చిలైట్లతో నిరసన తెలుపుతున్న దృశ్యం

పేర్కొన్నారు. ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా సముద్ర మార్గాల్లో వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే ఓడలు నిలిచిపోతున్నాయని, వాటిలో సరఫరా అవుతున్న పంటలు మధ్యలోనే నిలిచిపోవడం వల్ల కుళ్లిపోతున్నాయని అన్నారు. దీంతో రైతాంగం ఎంతో కష్టపడి పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వ్యవసాయ రంగానికి నష్టం కలిగిస్తున్న అమెరికా--భారత్ వ్యవసాయ ఒప్పందాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చిన్నతుంబళంలో అమెరికా తీరుకు వ్యతిరేకంగా టార్చిలైట్లతో నిరసన తెలుపుతున్న దృశ్యం

# రాష్ట్ర రాజకీయాల్లో బలమైనశక్తిగా ఎదుగుతున్న జనసేన

## ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 14 :**

పెద్దకడబూరు గ్రామంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మండల నాయకుడు జిలకర గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు జిలకర గణేష్, రామాంజనేయులు, ఏసేపు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమం, పారదర్శక పాలన, సమాజంలో మార్పు కోసం పార్టీ కట్టుబడి పనిచేస్తోందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో మార్పు కోసం ప్రజలు ఎదురు చూస్తున్న నేపథ్యంలో జనసేన పార్టీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించబోతోందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం పోరాడటం జనసేన పార్టీ లక్ష్యమని,



పెద్దకడబూరులో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో జనసైనికులు

గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సుభాన్, మహదేవ, గోపాల్, ఆలం బాషా, సాయిబన్న, విరూపాక్షి, రామాంజి, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోడిగుడ్ల ఏసేపును పరామర్శించిన టీడీపీ నేతలు

## అధైర్య పడొద్దని భరోసా..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 14 :**

పెద్దకడబూరు గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపు ఇటీవల ఎమ్మిగనూరు పట్టణంలో రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి, ఏపీ కురువ కార్పోరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, టీడీపీ సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్న, ఎన్. హనుమంతరెడ్డి, కోసిగి ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, టీడీపీ మండల ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, కోసిగి మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు బొగ్గుల తిక్కన్న కోడిగుడ్ల ఏసేపును పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని టీడీపీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కోడిగుడ్ల ఏసేపు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏసేపు ఆరోగ్య విషయాలను తెలుసుకుంటున్న మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి



టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపును పరామర్శిస్తున్న టీడీపీ నేతలు,



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

# ప్రధానోపాధ్యాయుడి అవినీతికి విద్యాశాఖ అధికారుల కొమ్ము

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటారా.. ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆగ్రహం

**కౌతాళం (తెలుగోడు), మార్చి 14 :**

అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఒక ప్రధానోపాధ్యాయుడిని కాపాడటానికి విద్యాశాఖ అధికారులు పడుతున్న తాపత్రయం వెనుక ఉన్న రహస్యమేమిటని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్ నిలదీశారు. గత 25 రోజులుగా అవినీతి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఉద్యమాలు చేస్తున్నా, సాక్ష్యాధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఉలుకూ పలుకూ లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. విద్యాశాఖ అధికారులు విద్యార్థుల పక్షాన ఉన్నారా? లేక అవినీతిపరుల పక్షాన ఉన్నారా అని ప్రశ్నించారు. అక్షరాస్యతలో వెనుకబడిన కౌతాళం మండలంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సింది పోయి, ఇలాంటి అవినీతి అధికారుల వల్ల విద్య వ్యవస్థ సర్వనాశనం అవుతోంది. అక్రమార్కులను వెనకేసుకొచ్చే అధికారులు ఈ మండలంలో ఉండటం వల్ల ప్రభుత్వ విద్యకు ఒరిగేదేమీ లేదు. పేద విద్యార్థుల నోరు కొట్టి, అక్రమ సంపాదనకు అలవాటు పడిన సదరు ప్రధానోపాధ్యాయుడిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారుల తీరు మారకపోతే, ఈ విషయాలన్నీ నేరుగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తాం. అవినీతికి సహకరిస్తున్న అధికారుల జాతకాన్ని కూడా బయటపెడతాం.అని హెచ్చరించారు.గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి మేడం గారు తక్షణమే స్పందించాలి. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి. ఒకవేళ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే, వేల సంఖ్యలో విద్యార్థులతో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.అని ఏఐఎస్ఎఫ్ పక్షాన హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శి హనుమేష్, సాయి వర్మ, స్వామి, గోవిందు, భీమయ్య, ఐనూర్, తదితరు నాయకులు పాల్గొన్నారు



కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ మారుతిని సన్మానిస్తున్న వైసీపీ నాయకులు

# పోలీసు అధికారులకు ఘన సన్మానం

## శాంతిభద్రతల పరిరక్షణపై చర్చ.. వైసీపీ నేతలు..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 14 :**

పెద్దకడబూరులోని పోలీసు స్టేషన్‌లో కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ మారుతిని వైసీపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో దొడ్డిమేకల గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, వైసీపీ నాయకులు జాము మూకయ్య, రామలింగారెడ్డి, శివరామరెడ్డి, బ్రహ్మయ్య ఆచారి, దిట్టికాటి లింగన్న తదితరులు సీఐ మంజునాథ్, ఎస్ఐ మారుతిలకు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలపై నాయకులు ప్రశంసలు వ్యక్తం చేశారు. ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని వారు పేర్కొన్నారు. మండలంలో శాంతి, భద్రతలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.



తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుమారుడు సూర్యవిక్రమాదిత్య, సాక్షి దంపతులను ఆశీర్వదిస్తున్న సీఎం చంద్రబాబు

# సహకార రాజీ పరిష్కార పథకం 2026ను సద్వినియోగం చేసుకోండి

## కెడిసిసి బ్యాంక్ సీఈఓ రామాంజనేయులు .. కౌతాళం సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు ..

**కౌతాళం (తెలుగోడు), మార్చి 14 :**

సహకార రాజీ పరిష్కార పథకం 2026ను సద్వినియోగం చేసుకోవాలని కెడిసిసి బ్యాంక్ సీఈఓ రామాంజనేయులు , కౌతాళం సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు అన్నారు. కౌతాళం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన సహకార రాజీ పరిష్కార పథకం 2026 కార్యక్రమానికి కెడిసిసి బ్యాంక్ సీఈఓ రామాంజనేయులు ప్రారంభించారు. ఈ పథకం ప్రయోజనాలను వివరించారు. కౌతాళం సొసైటీ చైర్మన్ అల్లూరి



సన్మానిస్తున్న దృశ్యం

వెంకటప్ప రాజు మాట్లాడుతూ ఈ పథకానికి అర్హులైన, సొసైటీలో ఖాతా ఉన్న ప్రతి ఒక్క రైతు వినియోగించుకోవాలని తెలిపారు. ఎవరికైనా ఈ పథకంపై సందేహాలు ఉంటే సొసైటీ సిబ్బందిని కలిసి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఆదోని కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ మహబూబ్ బాషా, సూపర్వైజర్ విజయభాస్కర్, రామకృష్ణ, వెంకటేష్, బసవరాజ్, జాఫర్, కౌతాళం టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజనందు , తెలుగు యువత నాయకులు గొట్టయ్య, మరియు కౌతాళం సొసైటీ సహాయక సిబ్బంది పాల్గొన్నారు.



సహకార రాజీ పరిష్కార పథకం 2026 గురించి వివరిస్తున్న దృశ్యం



# రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవండి

**విశాఖపట్నం, మార్చి 14 :**
దేశవ్యాప్తంగా రక్త నిల్వలు ఎంతో అవసరమని, కాబట్టి ప్రతి ఒక్కరూ సమాజ బాధ్యతగా భావించి రక్తదానం చేసి ప్రాణదాతలు గా నిలవాలని ప్రభుత్వ విప్..విశాఖ పశ్చిమ శాసనసభ్యులు గణబాబు పిలుపునిచ్చారు.. శనివారం ఎన్ఏడి జంక్షన్ కళాక్షేత్రంలో డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.. తొలుత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన గణబాబు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని.. వాటిని తగ్గించడంతోపాటు ఎక్కడికక్కడ అవసరమైన మేరకు రక్త నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.. అలా చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడేందుకు అవకాశం కలుగుతుందన్నారు..అందువల్ల యువత ఎక్కువగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని గణబాబు కోరారు. మనం చేసే రక్తదానం ఎంతోమందికి ప్రాణం నిలబెడుతుందన్నారు.. సామాజిక సేవలో డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ ముందు వరుసలో ఉంటున్నారు.. రక్షణ రంగంలో విధులు నిర్వహిస్తూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.. అసోసియేషన్ భవనాన్ని ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు.. అలాగే అధికారుల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం నిరంతరం ఉంటుందన్నారు. అన్ని కార్యక్రమాల్లో తనను భాగస్వామ్యం చేయడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా హాజరైన గాజువాక బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బండి యశోధర వేదమణి ,ప్రముఖ గైనకాలజిస్ట్ లక్ష్మీ కొండమ్మ బొత్స లు మాట్లాడుతూ సమాజానికి ఎంతో ఉపయోగకరమైన ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఐందుకు కృషి చేస్తున్న డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ సభ్యుల సేవలు ప్రశంసనీయమన్నారు.. మెగా రక్తదాన శిబిరంలో తమను కూడా భాగస్వాములను చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు అధ్యక్షులు బత్తుల చిరంజీవి లు మాట్లాడుతూ అందరి సహకారంతోనే అసోసియేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు ఇప్పటికే విద్య ప్రోత్సాహకాలు.. వైద్య .. రక్తదాన శిబిరాలు.. వన సమారాధన.. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. .. విశాఖ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో సుమారు 90 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ఎస్.రాజకుమారి, అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, కోశాధికారి గంరెడ్డి శ్రీనివాసరావు. అదనపు కార్యదర్శి రాజకుమార్ సభ్యులు రమణ ..సన్యాసిరావు కాలనీ ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు తదితరులతో పాటు పెద్ద ఎత్తున సభ్యులంతా పాల్గొన్నారు.



# వైభవంగా సత్తెమ్మ తల్లి మరిడిమాంబ అమ్మవారి వార్షిక పండుగ

**సింహాచలం, మార్చి 14 :**
సింహాద్రి నాథుడు సోదరి, అడవివరం శ్రీనివాస్ నగర్ పరిసర 14 గ్రామాల ప్రజల పొలిమేర దేవతగా విరాజిల్లుతున్న శ్రీ సత్తెమ్మ తల్లి.. మరిడిమాంబ అమ్మవారి వార్షిక పండుగ శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.. ప్రతి ఏటా అమ్మవారి పుట్టినరోజుని పురస్కరించుకొని మార్చి 14 న నిర్వహించే వార్షిక పండుగను ఈ ఏడాది కూడా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిపించారు.. తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి ఆరాధన గావించారు. అనంతరం పలు గ్రామాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులందరికీ అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు కంట్ల శ్రీనుబాబు దంపతులు అధ్యక్షులు పి వెంకటరావులు అమ్మవారికి నూతన వస్త్రాలను సమర్పించారు.. ఈ సందర్భంగా భక్తులకి ప్రసాద వితరణ... భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని గావించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కన్నా మాట్లాడుతూ ప్రతి ఏటా అమ్మవారి వార్షిక పండగను అత్యంత వైభవంగా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ అందరి సహకారంతోనే అమ్మవారు ఆలయం అభివృద్ధి చేయగలిగామన్నారు. సింహాద్రి నాథుడు సోదరిగా పొలిమేర దేవతగా విరాజిల్లుతున్న సత్తెమ్మ తల్లి మరిడిమాంబ అమ్మవారు ఎంతో మహిమాన్వితురాలు అన్నారు.. గ్రామ పొలిమేరలో కాపలాగా ఉండి దుష్టశక్తుల నుంచి ప్రజలను కాపాడుతున్న అమ్మవారి ఆశీస్సులు అన్ని గ్రామాల ప్రజల పైన ఉండాలని లోకమంతా సుభిక్షంగా ఉండాలని తాము కోరుకున్నట్లు చెప్పారు.. ఆలయ కమిటీ సభ్యులు గంట్ల కనకరాజు బలిరెడ్డి శ్రీనివాస రావు, పారిశ్రామికవేత్త బీవీ కృష్ణారెడ్డి, స్థానికులు మహేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు దొంతల సంతోష్.. నవయుగ సేవా సంఘం అధ్యక్షులు ప్రవీణ్ తో పాటు వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పండుగ సందర్భంగా అమ్మవారితో పాటు ఆలయాన్ని అత్యంత శోభాయమానంగా అలంకరించారు.

# భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

## కన్నుల పండుగగా రాములోరి కళ్యాణం.. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుగవాసి ..

**టి.సుండుపల్లి (తెలుగోడు), మార్చి 14 :**
సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని కంచిపాటివాండ్లపల్లెలో శనివారం నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతమ్మ, రామలక్ష్మణుల విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట చేసి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. శాస్త్రక్తంగా పేద పండితులచే కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు కళ్యాణాన్ని తిలకించేందుకు గ్రామస్తులతో పాటు మండల ప్రజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు హాజరయ్యారు. గ్రామస్తులు ప్రసాద్ బాబుకు డప్పు వాయిద్యాలు బాణసంచాలు పేలుస్తూ ఊరిలోకి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు మండల ప్రజలను భగవంతుడు చల్లగా చూడాలని టెంకాయ కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహేష్ నాయుడు, మండల అధ్యక్షుడు రమేష్ నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి శివారెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, రైతు సేవా సంఘం మండల అధ్యక్షుడు సుబ్బారామరాజు, చేనం శెట్టి వెంకటరమణ, జనసేన మహిళా నాయకురాలు రెడ్డి రాణి, పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



రామాయణంలో ప్రతిష్టించిన సీతారామ లక్ష్మణులు



రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న టిడిపి పార్లమెంటు అధ్యక్షుడు ప్రసాద్ బాబు

# కొత్తూరులో దేవాలయ నిర్మాణం వివాదం పరిష్కారం

**టెక్కలి (తెలుగోడు), మార్చి 14 :**
శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన కొత్తూరులో చిన్న హిందూ దేవాలయ నిర్మాణ వివాదా సమస్యను పరిష్కారించారు. కొంతమంది హిందూ ధర్మ వ్యతిరేక వ్యక్తులు దేవాలయ నిర్మాణం జరగకుండా అడ్డుకుంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని గ్రామస్తులు విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ దృష్టి కి తీసుకు వెళ్లారు. దీంతో శనివారం గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని వివరాలు సేకరించారు.దేవాలయం నిర్మాణం చేపట్టిన వ్యక్తులను,అడ్డుకుంటున్న వ్యక్తులను పోలీసులు సమక్షంలో చర్చలు జరిపి సామరస్య పూర్వకంగా సమస్యను పరిష్కరించారు.జిల్లా బజరంగ్ దళ్ సంయోజక్ కొయ్యాన కిరణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామం లోశాంతి, సామరస్యంతో దేవాలయ నిర్మాణం కూడా కొనసాగించాలని, హిందూ ధర్మానికి హిందూ దేవాలయాలకు ఎటువంటి హానికరం జరిగిన బజరంగ్దళ్ఉపేక్షించేదని లేదని తెలిపారు.గ్రామస్తులు దేవాలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్దళ్ జిల్లా సహ సంయోజక్ వంజల.శ్రీనివాసరావు గోరక్ష్ ప్రముఖ్ మెట్ట శ్రీనివాసరావు, జిల్లా సాప్తహిక్ మిలన్ ప్రముఖ్ కప్పిలు గజపతి, సురక్షా కరగాన నాగరాజు, శివారెడ్డి, కూన భూషణ్, నాగరాజు, మదన్ మోహన్ రావు, రాంజీ, లింగరాజు, చింతాడ సోమేశ్వరరావు, సాత్విక్ బజరంగ్ దళ్ కార్యకర్తలు హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు.



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

# ఎల్.ఎం. ఎస్వి గిరి కాలనీల్లో వాహనాల తనిఖీ

**ముద్దనూరు (తెలుగోడు), మార్చి 14 :**
స్థానిక ఎల్ ఎం. ఎస్ వి గిరి కాలనీలలో శనివారం సీఐ నగేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ (కార్డెన్ సెర్చ్) నిర్వహించారు. జిల్లా, డివిజన్ స్థాయి పోలీసు అధికారుల ఆదేశాలతో నిర్వహించిన ఈ తనిఖీలలో 30 టూ వీలర్ వాహనాలను, మూడు ఆటోలను, సీజ్ చేసి క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించ వాహన యజమానులకు అప్పగించారు. ఈ కార్డెన్ సెర్చ్ లో కొండాపురం, ఎర్రగుంట్ల, తాళ్ల పొద్దుటూరు సబ్ ఇన్స్పెక్టర్ లతోపాటు ముద్దనూరు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



కాలనీల్లో పర్యటిచిన పోలీసులు



స్వామి అమ్మవార్ల దర్శనానికి వస్తున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు

# మల్లన్న సేవలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**శ్రీశైలం (తెలుగోడు) మార్చి 14:**
ప్రముఖ శైవ క్షేత్రంగా జ్యోతిర్లింగా క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశైలం మహా క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శనివారం స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు వీరికి ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు అనంతరం స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు అమ్మవారి ఆశీర్వచనం మండపంలో గవర్నర్ కు ఆలయ అర్చక వేద పండితులు స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు.



గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను సన్మానిస్తున్న దేవస్థానం ఈవో, అర్చకులు



బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

# హెచ్‌పివి వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి

**హిరమండలం (తెలుగోడు), మార్చి 14 :**
గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణకు హెచ్ పి వి వ్యాక్సిన్ తప్పనిసరిగా వేసుకోవాలని వైద్యాధికారి సాయికుమార్ తెలిపారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హిరమండలం లో హెచ్ పి వి టీకాను 14 సంవత్సరాల వయస్సు బాలికలకు వేసారు.ఈ సందర్భంగా వైద్యాధికారి సాయికుమార్ మాట్లాడుతూ 14 సంవత్సరాల పూర్తి యైన బాలికలు టీకాను ప్రతీ ఒక్కరూ టీకా వేసుకోవాలని సూచించారు.ఈ వ్యాక్సిన్ వలన భవిష్యత్ లో గర్భాశయ ముఖ క్యాన్సర్ వ్యాధి రాకుండా ఉండేందుకు దోహద పడుతుందని. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నా ఈ టీకా బాలికల వేయించడానికి తల్లిదండ్రుల శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ టీకా పై ఎలాంటి అపోహలు పడనవసరం లేదని , ప్రతిరోజూ ఈ వ్యాక్సిన్ పి హెచ్ సీ లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి గౌతమీ పీహెచ్ ఎన్ ఆదిలక్ష్మి, హెచ్ వి రోజా రమణీ, ఏ న్ ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




# కాగ్ అక్షింతలతోనైనా చంద్రబాబు ప్రభుత్వం కళ్లు తెరవాలి

డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.

**విజయవాడ, మార్చి 14 :**
కాగ్ అక్షింతలతోనైనా చంద్రబాబు ప్రభుత్వం కళ్ళు తెరవాలని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. శనివారం విజయవాడ ఆంధ్ర రత్న భవన్లో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్ ఇచ్చిన నివేదికను ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టడం జరిగిందని, ఆ నివేదికలో అనేక అంశాలను ప్రస్తావించడం జరిగిందని తులసి రెడ్డి గుర్తు చేశారు. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండున్నర నెలలు వైకాపా ప్రభుత్వం,తర్వాత తొమ్మిదిన్నర నెలలు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదని,రాష్ట్రానికి ఆర్థిక స్థిరత్వం లేదని, రాష్ట్ర భవిష్యత్ అంధకారమని,భవిష్యత్తు గడ్డు కాలమని నివేదికలో స్పష్టంగా పేర్కొనడం జరిగింది. ఇవి ప్రమాద హెచ్చరికలు అని అన్నారు. 2024 -25 బడ్జెట్లో 68 743 కోట్ల రూపాయలు అప్పు ఉంటుందని అంచనా వేసి చివరికి 81 వేల 71 కోట్ల రూపాయలు అప్పు చేయడం జరిగింది.అంటే అప్పులు అంచనా కంటే 16 శాతం పెరిగాయన్నారు. ఇవి ప్రత్యక్ష అప్పులు మాత్రమే. పరోక్ష అప్పులు దీనికి అదనం అన్నారు. 2024 -25 లో 32 717 కోట్ల రూపాయలు మూలధనం వ్యయం చేయాలని బడ్జెట్లో అంచనా వేసి చివరికి 16, 141 కోట్లు మాత్రమే మూలధన వ్యయం చేయడం జరిగింది అంటే అంచనా కంటే 50 శాతం తగ్గింది.2023 -24 కంటే 2024 25 లో మూలధన వ్యయం 12 శాతం తగ్గింది అన్నారు. 2024 -25 లో కేంద్ర ప్రభుత్వం నుంచి 30 వేల 333 కోట్ల రూపాయలు గ్రాంట్ గా వస్తుందని అంచనా వేయగా చివరికి 20వేల 188 కోట్ల రూపాయలు మాత్రమే కేంద్రం నుంచి గ్రాంట్ రూపంలో వచ్చింది.అంటే పదివేల 145 కోట్ల రూపాయలు అంచనా కంటే తగ్గింది. డబుల్ ఇంజన్ పనితీరు ఇదేనా? అని తులసి రెడ్డి ప్రశ్నించారు అన్నారు.

2024 -25 ఆర్థిక సంవత్సరంలో 365 రోజులకు గాను 357 రోజులు రాష్ట్రప్రభుత్వం రిజర్వ్ బ్యాంకు వద్ద దేహీ అని చిప్ప పట్టుకుని చేబదుళ్ళ ద్వారా అప్పు తీసుకోవడం అత్యంత దురదృష్టకరం. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో ఒక్క లక్ష 72 వేల 532 కోట్ల రూపాయలు రాష్ట్రప్రభుత్వం రిజర్వ్ బ్యాంకు దగ్గర చేబదుళ్ల రూపంలో అప్పు చేసిందని అందుకుగాను 303 కోట్ల రూపాయలు వడ్డీ చెల్లించని చెల్లించిందని తులసి రెడ్డి వివరించారు అన్నారు.

కాల్ అక్షింతలతోనైనా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జ్ఞానోదయం తెచ్చుకొని ఆర్థిక క్రమశిక్షణ పాటించి రాష్ట్రాన్ని అప్పుల ఊభి లోకి నెట్టవద్దని తులసి రెడ్డి సూచించారు.

భారతదేశ సార్వభౌమత్వం కోసమే మహాత్మా గాంధీ,తదితర స్వాతంత్ర సమరయోధులు బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి దేశానికి స్వాతంత్రం తెచ్చారు. మన రాజ్యాంగంలో భారతదేశం సర్వసత్తాక సార్వభౌమత్వ దేశమని పేర్కొనడం జరిగింది. కానీ దురదృష్టవశాత్తు నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం భారతదేశ సార్వభౌమత్వాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు తాకట్టు పెట్టడం దురదృష్టకరం.భారతదేశం ఎవరి దగ్గర పెట్రోలు,డీజీలు, గ్యాస్ తదితర వస్తువులు కొనాలి,ఎవరి వద్ద కొనొద్దు అని భారతదేశాన్ని అమెరికా అధ్యక్షుడు ఆదేశించడం, నిర్దేశించడం శోచనీయం.ఇది అత్యంత సిగ్గుచేటని తులసి రెడ్డి ధ్వజమెత్తారు. చేతనైతే భారతదేశ సార్వ భౌమత్వాన్ని కాపాడాలి, లేకపోతే ప్రధానమంత్రి పదవి నుండి దిగిపోవాలి అని తులసి రెడ్డి మోడీకి సూచించారు.

ప్రత్యేక అధికారుల నియామకం రాజ్యాంగ విరుద్ధం, ప్రజాస్వామ్య విరుద్ధం అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ లకు,మునిసిపాలిటీలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులను నియమించడం రాజ్యాంగ విరుద్ధం,అప్రజాస్వామికమని తులసిరెడ్డి విరుచుకుపడ్డారు.73,74 రాజ్యాంగ సవరణ చట్టాల ప్రకారం స్థానిక ప్రభుత్వాలకు కాలపరిమితి పూర్తి అయ్యేలోపు ఎన్నికల నిర్వహించాలి. పార్లమెంటుకు, అసెంబ్లీకి ఏ విధంగా అయితే కాలపరిమితి ముగిసిలోపే సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తారో అదేవిధంగా స్థానిక ప్రభుత్వాలకు కూడా కాలపరిమిత అయ్యేలోపు ఎన్నికల నిర్వహించాలి.కానీ రాష్ట్ర ఎన్నికల కమిషన్,రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహించకుండా ప్రత్యేక అధికారులను నియమించడం దురదృష్టకరం. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే గ్రాంట్లు కూడా నిలిచిపోతాయి. కాబట్టి స్థానిక ప్రభుత్వాలకు కాలపరిమితి పూర్తయ్యలోపు ఎన్నికలు నిర్వహించాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

**రూర్బన్ పంచాయతీలలో ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి.**

మునిసిపాలిటీల తరహాలో పారిశుద్ధ్యం,తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులు కల్పించేందుకు పదివేలకు పైగా జనాభా వుండి,కోటి రూపాయల పైగా ఆదాయం ఉన్న 359 గ్రామపంచాయతీలను రూర్బన్ గ్రామపంచాయతీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదమని తులసి రెడ్డి అన్నారు. అమ్మకు అన్నం పెట్టని ప్రబుద్ధుడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్లుంది రాష్ట్ర ప్రభుత్వ వాలకమని ఎద్దేవా చేశారు.ఇప్పటికే ఉన్న మున్సిపాలిటీలలో పారిశుధ్యం,త్రాగునీరు తదితర మౌలిక వసతులు కల్పన అధ్వాన్నంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రూర్బన్ గ్రామపంచాయతీల లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తాం అని చెప్పడం హాస్యాస్పదమన్నారు. తాటి చెట్టు ఎందుకు ఎక్కావు అంటే దూడ గడ్డి కోసం అన్నట్లు ఉంది. రూర్బన్ గ్రామపంచాయతీ ల పేరుతో 359 గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్ర ఉన్నట్లు అర్థమవుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రూర్బన్ గ్రామపంచాయతీల లో కూడా ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ఏపీసీసీ ఉపాధ్యక్షులు, అడ్మిన్ ఇంచార్జ్ కొలను కొండ శివాజీ, ఏఐసిసి మాజీ సభ్యులు బషీర్ అహ్మద్,కాంగ్రెస్ పార్టీ రైతు నాయకుడు కొమ్మినేని సురేష్,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

# జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదు

**తగినంత నిల్వ ఉంది..**
**అక్రమంగా గ్యాస్ నిల్వ ఉంచి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు**
**జిల్లా కలెక్టర్ ఆనంద్ హెచ్చరిక. .**

**గుత్తి (తెలుగోడు), మార్చి 14 :**
గ్యాస్ కొరత ఉందంటూ అనవసరంగా ఆందోళన చెంది అవసరం లేకున్నా గ్యాస్ బుక్ చేసుకుని నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని, ప్రజలు సహరించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో డొమెస్టిక్ ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, తగినంత నిల్వ ఉందని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా గ్యాస్ నిల్వ ఉంచి ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం రాత్రి గుత్తి పట్టణంలోని ఫుట్ బాల్ గ్రౌండ్ లో నిర్వహించిన గుత్తి కోట ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్యాస్ కొరతపై సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల్లో గ్యాస్ కొరత ఉందని వస్తున్న వదంతులను నమ్మొద్దన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత ఎల్పీజీ గ్యాస్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. మన రాష్ట్రంలో సుమారు 17వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్ అందుబాటులో ఉందని తెలిపారు. అవసరం మేరకు గతంలో ఏవిధంగా అయితే గ్యాస్ బుకింగ్ చేసుకుంటున్నారో ఆ విధంగా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని కోరుతున్నామన్నారు. అనవసరంగా ఆందోళన చెంది అవసరం లేకున్నా గ్యాస్ బుక్ చేసుకుని నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని ప్రజలు గమనించాలన్నారు.ఏదైనా గ్యాస్ ఏజన్సీ గాని, ఇతరాలు గానీ ఎవరైనా అక్రమంగా ఎల్పీజీ గ్యాస్ నిల్వ ఉంచి బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డొమెస్టిక్ గ్యాస్ ఏదైనా బ్లాక్ లో అమ్మడం కానీ, అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం ఉంటే పౌర సరఫరాల అధికారులకు సమాచారం అందించాలని నిబంధనలకు విరుద్ధంగా బ్లాక్ మార్కెట్లో గ్యాస్ సిలిండర్లు అమ్మితే చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.


విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆనంద్


హైదరాబాద్‌లో ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ నివాసానికి వెళ్లి నవ దంపతులు శిరీష్, నయనికలను ఆశీర్వదిస్తున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు


గుత్తి కోట ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న ప్రసంగిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

# అంగరంగ వైభవంగా గుత్తి కోట ఉత్సవాలు

**రాబోయే రోజుల్లో పర్యాటక స్థలంగా**
**గుత్తి కోట అభివృద్ధి ..**
**ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ. .**
**ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం..**

**గుత్తి (తెలుగోడు), మార్చి 14 :**
జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గుత్తి కోట ఉత్సవాలు - 2026 ఘనంగా మొదలయ్యాయి. శనివారం సాయంత్రం గుత్తి పట్టణంలోని ఫుట్ బాల్ గ్రౌండ్ లో గుత్తి కోట ఉత్సవాలను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, వీర శైవ లింగాయత్ వెల్ఫేర్ డెవలప్మెంట్ ఛైర్మన్ స్వప్న, తదితరులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుత్తి మున్సిపల్ ఛైర్మన్ వన్నూర్ బీ, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి, గుత్తి మున్సిపల్ వైస్ ఛైర్మన్ బిందే వరలక్ష్మి, మార్కెట్ యార్డు ఛైర్మన్ సూర్యప్రతాప్, 21 వ వార్డు కౌన్సిలర్ వాల్మీకి శివప్రసాద్, డిఆర్ఓ ఏ.మలోల, యాదవ్ కార్పొరేషన్ డైరక్టర్ మస్తాన్ యాదవ్, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మన గుత్తి కోట ఉత్సవాలు 2026 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 50 లక్షల రూపాయల నిధులను కేటాయించిందని, ఇందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పర్యాటక స్థలంగా గుత్తి కోటను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఎంతో చారిత్రక ప్రాధాన్యత కలిగిన గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి భవిష్యత్తులో అవసరమైన అభివృద్ధి పనులు నిర్వహించడానికి ఎంపీ నిధుల నుండి 50 లక్షల రూపాయలు ఖర్చు చేసి జాతీయ రహదారి నుండి కోటపై రోడ్డు ఏర్పాటుకు అవసరమైన ఆర్చ్ ఏర్పాటు చేయడానికి సహకరిస్తానని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ గుత్తి కోటను భవిష్యత్తులో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళిక సిద్ధం చేసి ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి ద్వారా చంద్రబాబు నాయుడుకి అందజేయడం జరిగింది అన్నారు. గుత్తి పట్టణ శివారులోని జాతీయ రహదారి నుండి కొత్తపేట మార్గం ద్వారా కోటపైకి వెళ్లడానికి వీలుగా నాలుగు కోట్ల రూపాయలతో అవసరమైన రోడ్ల నిర్మాణం పనులకు ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన డిపిఆర్ సిద్ధం చేసిందన్నారు భవిష్యత్తులో ప్రతి సంవత్సరం గుత్తి కోటలో పర్యాటక ఉత్సవాలను నిర్వహించి ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను అందించటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రత్యేకించి గుత్తి కోట చరిత్రలో జిల్లా ప్రజలకు తెలియచేయడానికి ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయి అన్నారు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తీసుకున్న చర్యలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు ప్రజా ప్రతినిధులు


సంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు. భారీగా తరలివచ్చిన జనం



# అపోహలు వీడండి..
# హెచ్.పి.వీ వ్యాక్సిన్ వేయించుకోండి

**ఎమ్మెల్యే పరిటాల సునీత ..**

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 14 :**
హెచ్.పి.వీ వ్యాక్సిన్ పై అపోహలు వీడి 14 నుంచి 15ఏళ్ల లోపు బాలికలు ప్రతి ఒక్కరూ వేయించుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని కురుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళల ఆరోగ్య రక్షణ కోసం ప్రారంభించిన హెచ్.పి.వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడ వైద్యులతో మాట్లాడి వ్యాక్సిన్ ఎంత మందికి వేయించారు.. పిల్లల తల్లిదండ్రులు దీనిపై ఏమంటున్నారు వంటి అంశాల గురించి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వైకల్ (గర్భాశయ) క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులను నివారించడంలో ఈ వ్యాక్సిన్ ఎంతో కీలకమైందన్నారు. అందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా దినోత్సవం రోజున దీనిని ప్రారంభించారన్నారు. 14సంవత్సరాలు వయసు పూర్తి అయి 15సంవత్సరాల వయసు లోపల కలిగిన బాలికలకు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఈ వ్యాక్సిన్ గురించి మొదట చెప్పినప్పుడు చాలా మందిలో అపోహలు ఏర్పాడ్డాయన్నారు. కరోనా వ్యాక్సిన్ వేయించుకున్న వారికి గుండెపోటు వస్తోందన్న ప్రచారం కూడా జరిగిందన్నారు. కానీ ఈవ్యాక్సిన్ల వలన ఎలాంటి ప్రమాదం ఉండదని.. ఇటీవల పెరిగిపోతున్న క్యాన్సర్ వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రైవేట్ గా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలంటే సుమారు 12 వేల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఇటీవల మహిళల్లో క్యాన్సర్ వ్యాధి ఎక్కువగా కనిపిస్తోందన్నారు. ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇటీవల బసవతారకం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించినట్టు చెప్పారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఉచితంగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని.. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. పిల్లల తల్లిదండ్రులకు దీనిపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. అనంతరం కురుగుంట కస్తూరిబా బాలికల జూనియర్ కళాశాల అదనపు భవనాలను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని... ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే పాపంపేట, వివేకానంద నగర్ లో 20లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిసి రోడ్డును స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

రుద్రంపేట, తాడిమర్రి వ్యవసాయ సహకార పరపతి సంఘాల (రాజా) నూతన కమిటీ సభ్యులు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిశారు. రుద్రంపేట నూతన అధ్యక్షునిగా నియమితులైన కాటిగాని కాలువ శ్రీనివాసులు, సభ్యులు ఆలమూరు బాల నరసింహులు, కక్కలపల్లి పేట వన్నూరప్ప మరియు తాడిమర్రి నూతన అధ్యక్షునిగా నియమితులైన కునుకుంట్ల శ్రీనివాస రెడ్డి, సభ్యులు పిన్నదరి రమణ, మరువపల్లి లక్ష్మీనారాయణ గార్లు స్థానిక మండల నాయకులతో కలిసి అనంతపురం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతతో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. తమకు పదవులు ఇచ్చినందుకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు.





శంకర్ నాయుడు కుమారుడి వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్న కదిరి శాసనసభ్యులు కందికుంట

# రాయలసీమ టెంపుల్ సిటీగా తాడిపత్రిని అభివృద్ధి చేద్దాం

**మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 14 :**
తాడిపత్రిని రాయలసీమ టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయడం ద్వారా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని మాజీ శాసనసభ్యులు, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా గుత్తి కోట వద్ద నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ గుత్తి ఫోర్ట్ ఫెస్టివల్ కార్యక్రమంలో శనివారం జేసీ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణలకు శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం తాడిపత్రిని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.
ఫెస్టివల్ ప్రాంగణంలో టెంపుల్ సిటీ ఆఫ్ రాయలసీమ - తాడిపత్రి పేరుతో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఆ స్టాల్‌లో తాడిపత్రి ప్రాంతంలోని చారిత్రాత్మక దేవాలయాలు, మహా రథోత్సవాల దృశ్యాలను డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రదర్శించగా సందర్శకులను ఆకట్టుకున్నాయి. తాడిపత్రిలోని ప్రాచీన దేవాలయాలు మరియు వాటి శిల్పకళకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్ పరిధిలో తాడిపత్రిని అభివృద్ధి చేయాలని జేసీ ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.
తాడిపత్రిలోని ప్రసిద్ధ దేవాలయాలు అయిన శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం, శ్రీ చింతల వెంకటరమణ స్వామి దేవాలయం విజయనగర కాలపు అద్భుత శిల్పకళకు నిలువెత్తు నిదర్శనాలని తెలిపారు. ఇవేకాక పరిసర ప్రాంతాలలోని జూటూరు వజ్రగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం, పెద్దపప్పూరు శ్రీ అశ్వర్థనారాయణ స్వామి దేవాలయం, చుక్కలూరు శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం, అలూరు కోన శ్రీ రంగనాథ స్వామి దేవాలయం, తాడిపత్రి పట్టణంలో ప్రపంచంలోని అతిపెద్ద ఏకశిలా విగ్రహంగా ప్రసిద్ధి పొందిన శిరిడీ సాయి బాబా మందిరం, శ్రీ వేదగాయత్రి మాత ఆలయం వంటి ఆధ్యాత్మిక కేంద్రాలు ఈ ప్రాంతాన్ని ప్రముఖ పుణ్యక్షేత్రంగా నిలబెడుతున్నాయని పేర్కొన్నారు. ఈ దేవాలయ సముదాయం, జాతీయ రహదారి సౌకర్యం, సమీప పర్యాటక ప్రాంతాల దృష్ట్యా తాడిపత్రిని రాయలసీమ టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తే ఆధ్యాత్మిక పర్యాటకం పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని జేసీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.



టెంపుల్ సిటీ ఆఫ్ రాయలసీమ - తాడిపత్రి ప్రత్యేక స్టాల్


కలెక్టర్ ఆనంద్‌ను కలిసిన జేసీ ప్రభాకర్ రెడ్డి. ఎంపి అంబికాను సత్కరిస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు


**ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి..**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 14 :**
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 33 మసీదుల వద్ద ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి, ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులను జూనియర్ కళాశాల ప్రాంగణానికి తీసుకువచ్చి భారీగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. విందుకు పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరై ప్రార్థనలు చేసి ఉపవాస విరమణ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి స్వయంగా ముస్లిం సోదరులకు భోజనం వడ్డించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో 30 రోజులు ఉపవాసం (రోజా) పాటించడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. రంజాన్ నెల మనుషులలో శాంతి, సహనం, దానం, సేవా భావాన్ని పెంపొందించే పవిత్ర కాలమని పేర్కొన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు ఇవ్వడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి తెలిపారు. అన్ని మతాలు పరస్పర గౌరవం, సోదరభావంతో కలసికట్టుగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. తాడిపత్రి పట్టణంలో హిందూ, ముస్లిం సోదరులు ఎప్పటినుంచో ఐక్యంగా జీవిస్తూ మత సామరస్యానికి నిదర్శనంగా నిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందుకు హాజరైన మైనారిటీ నాయకులతో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి


ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి. మాజీ మునిసిపల్ వైస్ ఛైర్మన్ అబ్దుల్ రహమాన్‌తో కలిసి వడ్డిస్తున్న ఎమ్మెల్యే

# రాజ్ కుమార్ రావుతో కీర్తి సురేష్ జోడీ



బాలీవుడ్ విలక్షణ నటుడు రాజ్ కుమార్ రావు మరియు సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తొలిసారిగా జతకట్టబోతున్నారు. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'రఫ్తార్'. ఇంటెన్స్ థ్రిల్లర్ డ్రామాగా రాబోతున్న ఈ ప్రాజెక్టును రాజ్ కుమార్ రావు భార్య, నటి పత్రలేఖ తన సొంత నిర్మాణ సంస్థ 'కాంపా ఫిల్మ్స్'పై అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పణలో నిర్మించబోతుంది. విద్యా వ్యవస్థలోని చీకటి కోణాలు, కార్పొరేట్ పోటీ, సక్సెస్ కోసం ఆరాటపడే ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా సాగనుంది. ముఖ్యంగా డబ్బు, అధికారం మనుషుల సంబంధాలను ఎలా మారుస్తాయనే అంశాన్ని దర్శకుడు ఆదిత్య నింబాల్కర్ ఈ థ్రిల్లర్‌లో చూపించబోతున్నారు. ఇక నేషనల్ అవార్డు గ్రహీతలైన రాజ్ కుమార్ రావు, కీర్తి సురేష్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరితో పాటు అనూరాగ్ ఠాకూర్, తాన్యా మణిక్తలా మరియు రజత్ కపూర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో 'సెక్టార్ 36'తో మెప్పించిన ఆదిత్య నింబాల్కర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో కథనం చాలా ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ భారీ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

# 15న ఉస్తాద్ ప్రీరిలీజ్ వేడుకలు





పవన్‌కల్యాణ్ అభిమానులకు మరో శుభవార్త. పవన్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రీ-రిలీజ్‌వేడుక ఖరారైంది. మార్చి 15న హైదరాబాద్ పోలీస్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 5గంటల నుంచి ఈవెంట్ మొదలవుతుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. అలాగే దర్శకుడు హరీశ్ శంకర్ కూడా ఈ విషయాన్ని తెలియజేస్తూ 'ఈసారి ఈవెంట్ బద్దలైపోవాలి ఫ్రెండ్స్' అని పేర్కొన్నారు. ఇక శనివారం సాయంత్రం 'ఉస్తాద్' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేసింది. రాశీఖన్నా, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్న ఈ మూవీ మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'గబ్బర్ సింగ్' తర్వాత హరీశ్-పవన్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి.

# మరోమారు అనుష్క పెళ్లి వార్తలు

దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు 'లేడీ సూపర్ స్టార్'గా వెలుగొందిన అనుష్క శెట్టి వివాహ వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. గత కొన్నేళ్లుగా ఆమె పెళ్లిపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ, ఈసారి మాత్రం ఆమె త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. 44 ఏళ్ల అనుష్క ఈ ఏడాది పెళ్లి పీటలు ఎక్కేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వరుడు ఆమె కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్త అని, ఇది పూర్తిగా పెద్దలు కుదిర్చిన సంబంధమని సమాచారం. ఇప్పటికే ఇరు కుటుంబాల మధ్య చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. చాలా కాలంగా అనుష్క పేరు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో కలిపి వినిపిస్తున్న ప్పటికీ, వారిద్దరూ కేవలం ప్రాణ స్నేహితులమని పలుమార్లు స్పష్టం చేశారు. తాజా పరిణామాలతో ఈ రూమర్లకు చెక్ పడే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు, అనుష్క గత చిత్రం 'ఘాటి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం మలయాళ చిత్రం 'కథనార్' షూటింగ్‌లో మాత్రమే పాల్గొంటున్నారు. ఈ సినిమా పనులు పూర్తయిన వెంటనే ఆమె వివాహం చేసుకునే ఛాన్స్ ఉందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.




# ఉస్తాద్‌కు పోటీగా దురంధర్-2




హైదరాబాద్ బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్ ద రివెంజ్ ' సినిమాకు ఊహించని స్థాయిలో స్పందన లభిస్తోంది. బుక్‌మైషోలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమైనప్పటి నుంచి టికెట్ అమ్మకాలు ఏమాత్రం తగ్గకుండా రోజురోజుకూ మరింత పెరుగుతున్నాయి. బాలీవుడ్ సినిమా అయినప్పటికీ, టాలీవుడ్ టైర్-1 స్టార్ హీరో సినిమా తరహాలో బుకింగ్స్ ట్రెండ్ కనిపించడం ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. మార్చి 19న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' భారీ స్థాయిలో విడుదల కానుంది. నగరంలో ఇప్పటికే ఆ సినిమాకు రిలీజ్ ఫీవర్ నెలకొన్నప్పటికీ, దానికి ముందు రోజు అంటే మార్చి 18న ప్లాన్ చేసిన 'ధురంధర్ 2' ప్రీమియర్ షోలు కూడా భారీ స్పందనను సొంతం చేసుకుంటున్నాయి. ప్రస్తుతం నగరంలోని ప్రముఖ మల్టీప్లెక్స్‌లలో టికెట్లు వేగంగా అమ్ముడవుతున్నాయి. ముఖ్యంగా గచ్చిబౌలిలోని ఏఎంబీ సినిమాస్‌లో ప్రీమియర్ షోలు ఇప్పటికే హౌస్‌ఫుల్ అయ్యాయి. అలాగే ప్రసాద్స్ మల్టీప్లెక్స్ లో కూడా బుకింగ్స్ ఫాస్ట్ ఫిల్లింగ్ మోడ్‌లో కొనసాగుతున్నాయి. నగరంలోని మిగతా మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో కూడా టికెట్లు వేగంగా అమ్ముడవుతుండటంతో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. అయితే ఈ సినిమాకి సంబంధించి కొన్ని అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సినిమా రన్‌టైమ్ దాదాపు 3 గంటల 55 నిమిషాలు ఉండటం, ప్రేక్షకులను ఆలోచనలో పడేసే సూచనలు ఉన్నాయని అంటున్నారు. ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఇలాంటి సినిమాలకు దూరంగా ఉండే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ ఈ అంశాలు ఏవీ 'ధురంధర్ 2' క్రేజ్‌ను తగ్గించలేకపోయాయి. ప్రస్తుతం కనిపిస్తున్న అడ్వాన్స్ బుకింగ్స్‌ను చూస్తే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా కంటెంట్‌పై ఉన్న హైప్ కారణంగా ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక ప్రీమియర్ షోలకే ఈ స్థాయి స్పందన లభిస్తే, విడుదల తర్వాత సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే వీకెండ్ కలెక్షన్లు భారీగా ఉండే అవకాశముందని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్ 2' బుకింగ్స్ టాలీవుడ్ స్టార్ హీరోల సినిమాల స్థాయిలో దూసుకెళ్తుండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# దురంధర్ మూవీ టేకింగ్ సూపర్బ్..వర్మ

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తన కామెంట్స్‌తో హాట్ టాపిక్‌గా మారారు. బాలీవుడ్ దర్శకుడు ఆదిత్య ధర్ ప్రతిభను ప్రశంసిస్తూనే, ఆయనపై ఇండస్ట్రీ అసూయ చూపిస్తుందంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల ఆదిత్య ధర్ తెరకెక్కించిన 'ధురంధర్' సినిమా చూసిన తర్వాత తనకు ఆయనపై భారీ అభిమానం పెరిగిందని రామ్ గోపాల్ వర్మ తెలిపారు. ఆ చిత్రంలోని మేకింగ్, టేకింగ్ తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. ఆదిత్య ధర్ తన ప్రత్యేక శైలితో సినిమా మేకింగ్‌ను పూర్తిగా కొత్త దిశలోకి తీసుకెళ్లారని వర్మ ప్రశంసించారు. అయితే ఇదే సమయంలో పరిశ్రమలో ఆయనపై అసూయ కూడా పెరుగుతోందని వర్మ వ్యాఖ్యానించారు. ఆదిత్య ధర్ తీసుకొచ్చిన కొత్త తరహా మేకింగ్ వల్ల పలు భారీ యాక్షన్ చిత్రాల టీమ్‌లు తమ సినిమాల షూటింగ్‌లను ఆపేసి రీ-షూటింగ్ చేయాల్సి వస్తోందని చెప్పారు. దీంతో కొందరు నిర్మాతలు నష్టపోతున్నారని, అందుకే ఆదిత్య ధర్ ,ఆయన భార్య యామీ గౌతమ్ పతనం కోసం కొందరు వేచి చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి. రామ్ గోపాల్ వర్మ చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో కూడా విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.